

డిప్యూటీ డైరెక్టరుగా నందన్ నియామకం

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 21: డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయంలో డిప్యూటీ డైరెక్టర్‌గా వైవో నందన్‌ను నియమిస్తూ ప్రభుత్వ ప్రత్యేక చీఫ్ సెక్రటరీ అనిల్‌కుమార్ సింఘాల్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం కడప మున్సిపల్ కమిషనర్ (ఎఫ్ఏసీ)గా కొనసాగుతున్న వైవో నందన్ డిప్యూటీ డైరెక్టర్‌గా నియమాకం కావడంతో కడప మున్సిపల్ కమిషనర్‌గా ప్రభుత్వం ఎవరిని నియమిస్తుందో వేచి చూడాలి.

తహశీల్దార్ల బదిలీ

కడప(కలెక్టరేట్), సెప్టెంబరు 21: రాయలసీమ జోన్ పరిధిలో 17 మంది తహశీల్దార్లను బదిలీచేస్తూ సీసీఎల్ కమిషనర్ నీరబ్‌కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా కడప జిల్లాలో పనిచేస్తున్న తహశీల్దార్లు రమేశ్‌ను కర్నూలుకు, సువర్ణాదేవిని నంద్యాల జిల్లాకు బదిలీ చేశారు. సత్యసాయి జిల్లాలో పనిచేస్తున్న సుబ్బలక్ష్మమ్మను, తిరుపతి జిల్లాలో పనిచేస్తున్న దస్తగిరయ్యను కడప జిల్లాకు బదిలీ చేస్తూ సీసీఎల్ఏ కమిషనర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

'ఇది మంచి ప్రభుత్వం' కరపత్రాలు, స్టిక్కర్ల పంపిణీ

కడప(రూరల్), సెప్టెంబరు 21: కూటమి ప్రభుత్వం 100 రోజుల పాలనలో అమలు చేసిన పలు సంక్షేమ పథకాలకు సంబంధించి ముద్రించిన కరపత్రాలను, స్టిక్కర్లను ఉమ్మడి కడప జిల్లాలోని 50 మండలాలకు, మున్సిపాలిటీలకు పంపిణీ చేశామని జడ్పీ సీఈవో సుధాకర్‌రెడ్డి తెపారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్టిక్కర్లు, కరపత్రాలు జడ్పీకి వచ్చాయన్నారు. వాటిని ఆయా మండలాలకు చేరవేర్చామన్నారు. అక్కడ నుంచి గ్రామ సచివాలయాల ఉద్యోగుల ద్వారా ప్రజలకు అందిస్తామన్నారు.

పోషకాల పాఠశాల

- ఖాళీ స్థలంలో కూరగాయల సాగు
- సేంద్రియ పద్ధతిపై విద్యార్థులకు అవగాహన

కడప (ఎన్టీఆర్ సర్కిల్), సెప్టెంబరు 21: తరచూ కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతుండడంతో వాటి కొనుగోలు భారంగా మారుతోంది. దీంతో విద్యాసంస్థల్లో మెనూ సక్రమంగా అమలు కావడంలేదు. ప్రణాళిక తప్పుతోంది. దీనికి తోడు కూరగాయలు, ఆకుకూరలు అప్పటికప్పుడు కోసి వండుకుని తింటే ఆ రుచే వేరు. రసాయనాలు లేకుండా సేంద్రియ ఎరువులతో పండించిన వాటిని వండుకుని తింటే ఆరోగ్యానికి ఆరోగ్యం.. రుచికి రుచి. దీనికి మంచి మార్గం కిచెన్ గార్డెన్స్ విద్యాశాఖ అధికారులు కిచెన్ గార్డెన్స్‌పై దృష్టి పెట్టారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు పాఠశాల ఆవరణ, టెర్రస్ పైన పండ్లు, కూరగాయలు, ఆకుకూరల పెంపకాన్ని చేపట్టాలని నిర్ణయించారు. పోషకాల పాఠశాల, కిచెన్ గార్డెన్ పేరిట ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాలు, గురుకుల విద్యాలయాల్లో కిచెన్ గార్డెన్స్‌ను అధికార యంత్రాంగం ప్రోత్సహిస్తోంది. ముఖ్యంగా కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో వీటిని అమలులోకి తెచ్చారు. తోటల పెంపకంలో ప్రతి ఒక్కరినీ భాగస్వాములు చేయాలని నిర్ణయించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, వార్డెన్లు అధికారులతో కిచెన్‌గార్డెన్లను నిర్వహిస్తున్నారు. ఇవి సత్ఫలితాలను ఇస్తున్నాయి. తక్కువ స్థలంలోనే కిచెన్ గార్డెన్స్ ఏర్పాటు చేసుకుని 15 నుంచి 20 రకాల కూరగాయలు, ఆకుకూరలు, క్యారెట్, బంగాళాదుంప, ఉల్లిపాయ తదితర వాటిని సాగుచేస్తున్నారు. వీటిని విద్యార్థులకు మెనూలో వండి వడ్డిస్తున్నారు. దీంతో తోటల సాగు, సేంద్రియ విధానంపై విద్యార్థులకూ అవగాహన పెరుగుతోంది.


మైదుకూరు కేజీబీవీలో సాగైన వంగ తోట


వల్లూరు కేజీబీవీ స్కూలులో ఏర్పాటు చేస్తున్న కిచెన్ గార్డెన్


ఖాజీపేట కేజీబీవీలో కిచెన్‌గార్డెన్


మైదుకూరు కేజీబీవీ కిచెన్‌గార్డెన్‌లో పండిన వంకాయలు చూపుతున్న విద్యార్థులు



Sunday Special



సంక్షామమే..!

- అర్ధాకలితో హాస్టలు విద్యార్థుల అవస్థలు
- ఆరేళ్లుగా పెరగని మెస్‌చార్జీలు
- పెరిగిన ధరలతో మెనూ మేరకు కష్టమే..
- విడుదల కాని కాస్మెటిక్, మెస్‌చార్జీలు

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 21: భోజనం సక్రమంగా అందదు.. తలకు నూనె ఉండదు.. కప్పుకోవడానికి దుప్పటి లేదు.. లైటు కాలిపోతే మార్చే దిక్కు లేదు.. మరుగుదొడ్ల నిర్వహణ లేదు.. ఇదీ జిల్లాలోని సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థుల పరిస్థితి. ప్రభుత్వం నుంచి భోజన బిల్లులు విడుదల కాక, వారికి సక్రమంగా ఆహారం అందక అర్ధాకలితో అలమటిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో వసతిగృహాలు సమస్యల వలయంలో చిక్కుకుపోయాయి. విద్యార్థులకు ఇవ్వాల్సిన కాస్మటిక్ చార్జీలు, దుప్పట్లు ఇతర సామగ్రి చివరికి నోటు పుస్తకాలు కూడా వారికి సక్రమంగా అందడం లేదు. గత తొమ్మిది నెలలుగా ఆహారం కూడా సమస్యగా మారింది. ఇక హాస్టళ్ల నిర్వహణ నిధుల విడుదలలోనూ అలసత్వం చూపుతుండటంతో వసతిగృహాల్లోని విద్యార్థుల సంక్షేమం సంక్షోభంలో చిక్కుకుంది. పాలకుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ వసతిగృహాల నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది.

జనవరి నుంచి అందని బిల్లులు

పదోతరగతి లోపు, కళాశాల విద్యార్థులకు సంబంధించి జిల్లాలో బీసీ, ఎస్సీ, ఎస్టీ వసతిగృహాలు 129 ఉన్నాయి. వీటిలో 10,836 మంది విద్యార్థులున్నారు. వీరికి జనవరి నుంచి భోజన బిల్లులు చెల్లించలేదు. కోట్ల రూపాయలు బకాయిలు పేరుకుపోయాయి. బీసీ, ఎస్టీ విద్యార్థులకు అందాల్సిన సౌకర్యాలకు గత ప్రభుత్వం గండికొట్టింది. కూరగాయలు, సరుకులు, గ్యాస్, పాలను వసతిగృహ అధికారులు దుకాణాల నుంచి అప్పు తీసుకొచ్చి బిల్లులు విడుదలయ్యాక వారికి డబ్బు చెల్లించేవారు. తొమ్మిది నెలలుగా బిల్లులు విడుదల చేయకపోవడంతో సంక్షేమాధికారులు విద్యార్థుల ఆకలి తీర్చలేకపోతున్నారు. పైగా వారు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. దుకాణాల్లో సరుకులు తేవాలని ప్రయత్నాలు చేస్తున్నా వారికి అప్పు పుట్టడంలేదు.

వసతి గృహాలకు పెరగని బడ్జెట్

వసతిగృహాలకు ప్రభుత్వం చెల్లించే సరుకుల ధరలకు మార్కెట్లో ఉన్న ధరలకు పొంతన ఉండడంలేదు. దీంతో నిర్దేశించిన భోజనం మెనూ అమలు చేయలేక నిర్వహణ అధికారులు చేతులు ఎత్తేస్తున్నారు. పాఠశాల స్థాయి విద్యార్థులకు నెలకు రూ.2,200 ఖర్చవుతుంటే ప్రభుత్వం రూ.1,400 చెల్లిస్తోంది. కళాశాల స్థాయి విద్యార్థులకు నెలకు రూ.1,600 చెల్లిస్తుంది. కళాశాల విద్యార్థులకు రోజుకు రూ.53.30, స్కూలు విద్యార్థులకు రోజుకు రూ.46.50తో భోజనం, ఉదయం టిఫిన్ అందించాలి. పప్పు, కూరగాయలు, నూనె, గ్యాస్ అన్నివస్తువుల ధరలు భారీగా పెరిగాయి. ఆ స్థాయిలో ప్రభుత్వం వసతిగృహాలకు బడ్జెట్ పెంచడం లేదు. దీంతో నిర్దేశించిన మెనూ అమలు చేయలేక నిర్వహణ అధికారుల ఇబ్బంది పడుతున్నారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందిస్తున్నామని పాలకులు చెబుతున్నా ఆచరణలో మాత్రం ఎక్కడా కనిపించడంలేదు. మెనూ ప్రకారం అయితే తమ జీతాలు కూడా సరిపోవని కొందరు నిర్వాహకులు వాపోతున్నారు.

పాత ధరలతో భోజనం

ఐదేళ్ల వైసీపీ పాలనలో డైట్ చార్జీలు పెంచలేదు. దీంతో వసతిగృహాల విద్యార్థులు అర్ధాకలితో గడుపుతున్నారు. పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా ప్రభుత్వం మెస్ చార్జీలు పెంచకపోవడంతో మెనూలో కోత విధిస్తున్నారు. వారానికి ఆరురోజులు పెట్టాల్సిన కోడిగుడ్డును రెండురోజులే పెడుతున్నారు. చికెన్ వారానికి ఒక రోజుకే పరిమితం చేస్తున్నారు. కూరల్లోనాణ్యత కొరవడుతోంది. టీడీపీ ప్రభుత్వ హయాంలో 2018లో చివరి సారిగా మెస్‌చార్జీలు పెరిగాయి. అప్పట్లో విద్యార్థులకు మెనూ ప్రకారం సరైన ఆహారం అందించేవారు. ఎటువంటి ఇబ్బంది ఉండేది కాదు. అప్పటితో పోలిస్తే ప్రస్తుతం నిత్యావసరాలు, కూరగాయల ధరలు 150శాతం పెరిగాయి. ప్రభుత్వం చెల్లించే ధరలకు బయట మార్కెట్లో ఉన్న ధరలకు భారీ వ్యత్యాసం ఉండడంతో ఏం చేయాలో వార్డెన్లకు పాలు పోవడంలేదు. ఇప్పటికైనా కొత్త ప్రభుత్వం స్పందించి మెస్ చార్జీలను పెంచాలని కోరుతున్నారు.

అందని కాస్మెటిక్ చార్జీలు

వసతి గృహ విద్యార్థులకు కాస్మటిక్ చార్జీలు చెల్లించక పోవడంతో ఇబ్బంది పడుతున్నారు. 3 నుంచి 10వతేదీ వరకు ప్రీమెట్రిక్ హాస్టళ్లకు సంబంధించి విద్యార్థులకు బ్రష్, టూత్‌బ్రష్, తలకు నూనె రాసుకునేందుకు రూ.125 నుంచి రూ.150 వరకు అందిచాలి. పోస్టుమెట్రిక్ వారికి రూ.200 నుంచి రూ.250 వరకు అందించాలి. జుట్టు కత్తిరించుకోవడానికి రూ.50 ఇవ్వాలి. జనవరి నుంచి ఇప్పటి వరకు దాదాపు 9 నెలల నుంచి చెల్లింపులు నిలిచాయి. కోట్ల రూపాయలు పెండింగులో ఉన్నట్లు తెలుస్తోంది. దీనిపై కూటమి ప్రభుత్వం దృష్టిసారించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్యంగా పని చేయాలి

- జిల్లా ఆర్థికాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించండి
- కలెక్టర్ లోతేటి శివశంకర్

కడప(కలెక్టరేట్), సెప్టెంబరు 21: స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించాలని జిల్లా అధికారులను కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సభాభవనంలో స్వర్ణాంధ్ర విజన్-2047 ప్రణాళిక రూపకల్పనపై డీఆర్వో గంగాధర్‌గౌడ్‌తో కలసి అన్ని శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా రానున్న ఐదు సంవత్సరాలలో జిల్లాను అభివృద్ధి చేసేవిధంగా ఆయా శాఖలు ఈనెల 30వ తేదీలోగా మండల విజన్ ప్రణాళికలు రూపొందించాలన్నారు. జిల్లాలోని అన్ని శాఖలు లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని అమలు చేసేందుకు జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్ రూపొందించి అక్టోబరు 15వ తేదీలోగా నివేదించాలన్నారు. స్వర్ణాంధ్ర-స్వర్ణ కడప-2047పై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. వారి అభిప్రాయాలను తెలిపే విధంగా క్యూ ఆర్ కోడ్ అందుబాటులోకి తెచ్చామని, దీనిని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు ఈ నెల 30 నాటికి మండల విజన్ అందజేయాలన్నారు. ప్రతి రంగంలో 15 శాతం అభివృద్ధిని నిర్దేశించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వారంలో రెండు రోజులు పొలంబాట

కడప(కలెక్టరేట్), సెప్టెంబరు 21: వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు ప్రతి మంగళ, బుధవారాల్లో వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని కలెక్టర్ లోతేటి శివశంకర్ తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'పొలం పిలుస్తోంది' కార్యక్రమానికి సబంధించిన పోస్టర్‌ను శనివారం కలెక్టరేట్ సభాభవన్‌లో సంబంధిత అధికారులతో కలసి కలెక్టర్ ఆవిష్కరించారు.



పోస్టర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్ శివశంకర్

విజేత జట్టుకు ట్రోఫీ అందిస్తున్న రాజ్యసభ మాజీ సభ్యుడు తులసిరెడ్డి



హ్యాండ్‌బాల్ పోటీలలో కడపకు డబుల్ క్రౌన్

వేంపల్లె, సెప్టెంబరు 21: రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలలో కడపకు డబుల్ క్రౌన్ లభించిందని ఏపీ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. వేంపల్లె జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన 38వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ హ్యాండ్ బాల్ పోటీలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ బాలబాలికల విభాగంలో మొదటి స్థానాన్ని సంపాదించి కడప జట్లు డబుల్ క్రౌన్ సాధించాయన్నారు. రాజ్యసభ మాజీ సభ్యుడు తులసిరెడ్డి విజేతలకు ట్రోఫీలు, మెడల్స్ ప్రతిభాపత్రాలను అందించారు. వేంపల్లె జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, ఏపీ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, కడప జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, చాంపియన్‌షిప్ ఆర్గనైజింగ్ సెక్రటరీ రాశేఖర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సంగమేశ్వరరెడ్డి, రాష్ట్ర ఒలంపిక్ అసోసియేషన్ ప్రతినిధి రామాంజనేయులు, వివిధ జిల్లాల హ్యాండ్‌బాల్ సంఘ అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

న్యాయ వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం పెంచాలి

- హైకోర్టు జస్టిస్ జి.రామకృష్ణప్రసాద్

కడప(కలెక్టరేట్), సెప్టెంబరు 21: అందరికి న్యాయం అందాలని, న్యాయ వ్యవస్థపై ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించాలని హైకోర్టు జస్టిస్ జి.రామకృష్ణప్రసాద్ (అడ్మినిస్ట్రేట్ కడప జడ్జి) పేర్కొన్నారు. శనివారం కడపలో జిల్లా స్థాయి జుడీషియల్ అధికారులకు ఒక్కరోజు వర్క్ షాపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హైకోర్టు జస్టిస్ మాట్లాడుతూ పోక్సో యాక్ట్, డొమెస్టిక్ వయలెన్స్, చైల్డ్ అబ్యూజింగ్ యాక్ట్‌పై న్యాయవాదులు నిబద్ధతతో ఉండాలన్నారు. న్యాయవాద వృత్తి దైవంతో సమానమని సామాన్యులకు న్యాయసేవలు అందించాలన్నారు. న్యాయ సేవలను పొందడం ప్రతి ఒక్కరి హక్కు అన్నారు. చట్టానికి ఎవ్వరూ అతీతులు కారని, ఎలాంటి పక్షపాత ధోరణి లేకుండా న్యాయాన్ని అందించే స్వేచ్ఛ, రాజ్యాంగంలోని చట్టాలను కాపాడాల్సిన బాధ్యత న్యాయమూర్తులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ లోతేటి శివశంకర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, హైకోర్టు రిటైర్డ్ జడ్జి సీతారామమూర్తి, ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి శ్రీదేవి, రిటైర్డ్ జడ్జిలు మాధవరావు, అన్వర్ బాషా, జిల్లా న్యాయవాదులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న హైకోర్టు జస్టిస్ జి.రామకృష్ణప్రసాద్



ప్రభుత్వాసుపత్రిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్న ప్రైవేటు వైద్యునితో మాట్లాడుతున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ సుబ్బారెడ్డి

ఎవరికోసం..?

- ప్రభుత్వాసుపత్రిలో.. ప్రైవేటు వైద్యశిబిరం..!

బద్వేలుటౌన్, సెప్టెంబరు 21: బద్వేలు ప్రభుత్వాసుపత్రిలో శనివారం ఓ ప్రైవేటు ఆసుపత్రి వారు ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. వారి వైద్యసిబ్బంది ప్రభుత్వాసుత్రికి వచ్చిన రోగులకు పరీక్షలు నిర్వహించి ప్రైవేటు ఆసుపత్రికి సంబంధించిన కాగితాలపై మందులు రాసిచ్చారు. అలాగే ప్రైవేటు ఆసుపత్రికి సంబంధించిన బ్యానర్లను కూడా ప్రభుత్వాసుపత్రిలో ఏర్పాటు చేశారు. దీనిని చూసి పలువురు ఆశ్చర్యపోయారు. ప్రభుత్వాసుపత్రిలో ప్రైవేటు వైద్యం ఏమిటని అక్కడకు వచ్చిన వారు ప్రశ్నించారు. దీనికి వైద్యులు సమాధానం చెప్పలేకపోయారు. ప్రభుత్వాసుపత్రిలో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసి ఉచితంగా వైద్యం అందిస్తూ, మందులు పంపిణీ చేస్తున్నారు. అయినా ప్రభుత్వాసుపత్రిలో వైద్యులు లేరన్నట్లుగా ప్రైవేటు వైద్యులతో ఇక్కడ ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం ఎవరికోసం అంటూ విమర్శలు వచ్చాయి. దీనిపై ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ సుబ్బారెడ్డిని వివరణ కోరగా మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు ఏర్పాటు చేశామని అన్నారు. మున్సిపల్ కమిషనర్‌ను వివరణ కోరగా సమాధానాన్ని దాటవేశారు.


ప్రభుత్వాసుపత్రిలో ప్రిస్కిప్షన్లు రాస్తున్న ప్రైవేటు ఆసుపత్రి సిబ్బంది

మున్సిపల్ కమిషనర్ల బదిలీ

కలికిరి, సెప్టెంబరు 21: కడప, అన్నమయ్య జిల్లాల్లో పలువురు మున్సిపల్ కమిషనర్లను ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు శనివారం ఆదేశాలు జారీ అయ్యాయి. సత్యసాయి జిల్లా కదిరి మున్సిపాలిటీలో మేనేజరుగా పనిచేస్తున్న జి.వి.పల్లవిని అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట నగర పంచాయతీ మున్సిపల్ కమిషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతలతో నియమించారు. ప్రస్తుతం ఆ స్థానంలో ఉన్న పి.ఆర్.మనోహర్‌ను తొలగించారు. ప్రొద్దుటూరు మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ ఉత్తర్వులతో ఉన్న పి.వి.రామలింగేశ్వర్‌ను తిరిగి అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌కు అదనపు కమిషనరుగా బదిలీ చేశారు. అద్దంకి మున్సిపాలిటీలో శానిటరీ ఇన్‌స్పెక్టరుగా పనిచేస్తున్న ఎం.శ్రీనివాసరెడ్డిని మైదుకూరు మున్సిపల్ కమిషనరుగా బదిలీ చేశారు. కడప మున్సిపల్ కార్పొరేషన్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తూ కమలాపురం మున్సిపాలిటీ కమిషనరుగా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న కె.వెంకటరామిరెడ్డిని జమ్మలమడుగు కమిషనరుగా నియమించారు. అక్కడున్న డీపీవో ఎన్.ప్రమోద్ కుమార్‌ను మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టరేట్‌కు బదిలీ చేశారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టరేట్‌కు బదిలీ అయిన జి.రఘునాథరెడ్డి బదిలీ ఉత్తర్వులను రద్దు చేసి ప్రొద్దుటూరు మున్సిపల్ కమిషనరుగా నియమించారు. ఈ మేరకు రాష్ట్ర మున్సిపల్ పరిపాలన, అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రభుత్వ అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ల బదిలీ

కడప, అన్నమయ్య జిల్లాల్లోని వివిధ కోర్టుల్లో పనిచేస్తున్న గ్రేడ్-1, గ్రేడ్-2 అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌లను ప్రభుత్వం బదిలీ చేసింది. కడప ఎస్సీ, ఎస్టీ న్యాయస్థానంలో గ్రేడ్-1 అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేస్తున్న ఎస్.మొబీనా బేగంను గుంటూరు ఎస్సీ, ఎస్టీ నాలుగవ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కోర్టుకు బదిలీ చేశారు. రాజంపేట అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టులో గ్రేడ్-2 అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేస్తున్న ఎల్.బాలాజీని కడప అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టుకు బదిలీ చేశారు. అదే విధంగా చిత్తూరు ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టులో గ్రేడ్-2 అదనపు పీపీగా పనిచేస్తున్న జి.ఎస్.శైలజను మదనపల్లె ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టుకు బదిలీ చేశారు. హోం శాఖ (కోర్టులు) ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజీత్ ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రభుత్వ న్యాయవాది తొలగింపు

కడప ఒకటవ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కోర్టులో విద్యుత్ శాఖకు సంబంధించిన కేసులను వాదించడానికి నియమించిన న్యాయవాది కె.మహ్మద్ ఆలీఖాన్‌ను తొలగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మూడేళ్ల కాల వ్యవధితో ఈయనను 2023 ఫిబ్రవరిలో ప్రభుత్వం తరపున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమించారు. ఈయనకు నెలరోజుల గౌరవ వేతనాన్ని (రూ.40 వేలు) చెల్లించి ప్రభుత్వ న్యాయవాదిగా తొలగిస్తూ హోం శాఖ (కోర్టులు) ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజీత్ ఆదేశాలు జారీ చేశారు.

మూడు స్టాక్‌పాయింట్‌లలో ఇసుక



ఏటూరు రీచ్‌లో ఇసుక రవాణా వాహనాల వద్ద అధికారులు

కొండాపురం, సెప్టెంబరు 21: ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ఆన్‌లైన్ విధానం ద్వారా మండలంలోని మూడు స్టాక్‌పాయింట్‌లలో శనివారం ఇసుక రవాణా ప్రారంభమైంది. గురువారం నుంచి ప్రభుత్వం ఆన్‌లైన్ ద్వారా ఇసుకను బుకింగ్ సౌకర్యాన్ని కల్పించింది. అయితే రెండు రోజులుగా సర్వర్ పనిచేయకపోవడంతో ఇసుక రవాణా నిలిచిపోయింది. మండలంలోని ఏటూరు, పి.అనంతపురం, వెంకటాపురం ఇసుక స్టాక్ పాయింట్ల నుంచి ఇసుక రావాణాను జిల్లా మైనింగ్, రెవెన్యూ అధికారులు ప్రారంభించారు. జీపీఎస్ సిస్టమ్ ద్వారా పారదర్శకంగా ఇసుక రవాణా జరుగుతోందన్నారు. ఆన్‌లైన్ ద్వారా ఇసుకను బుక్ చేసుకున్న వారికి క్యూలో లేకుండా ఎప్పటికప్పుడు లోడింగ్ చేసి పంపుతున్నామన్నారు. కాగా ప్రస్తుతం రవాణా చార్జీలు కాకుండా లోడింగ్ చార్జీలకు టన్ను రూ. 340గా నిర్ణయించినట్లు తెలుస్తోంది. ప్రస్తుత ఆన్‌లైన్ విధానం ద్వారా ఎవరైనా మొబైల్ ద్వారా కూడా ఇసుకను బుక్ చేసుకోవచ్చు. కార్యక్రమంలో జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రామచంద్ర, ఏడీ శ్రీనివాసులు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ రాధా, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

మూడు వాహనాలు ఢీ - ఒకరి మృతి

మరో ఆరుగురికి గాయాలు



జాఫర్ మృతదేహం

సంబేపల్లె, సెప్టెంబరు21: కర్నూలు- చిత్తూరు జాతీయ రహదారి బావులకాడపల్లి క్రాస్ రోడ్డువద్ద శనివారం మూడు వాహనాలు ఒకదానికొకటి ఢీకొనడంతో జాఫర్ (66) మృతి చెందగా మరో ఆరుగురికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు...

కర్ణాటక రాష్ట్రం రాయచూరుకు చెందిన భక్తులు కారులో కాణిపాకం వెళుతుండగా బావులకాడపల్లె క్రాస్ రోడ్డు వద్ద ఎదురుగా వస్తున్న టాటా ఏసర్, కారు, ఆటో ఒకదాని కొకటి ఢీకొనడంతో రాయచోటి పట్టణం కొత్తపల్లికి చెందిన టాటా ఏసర్‌లో ప్రయాణిస్తు జాఫర్ మృతి చెందాడు. కారు అదుపు తప్పి పొలంలోకి దూసుకెళ్లడంతో కారులో ఉన్న ఆరుగురికి గాయాలైనట్లు తెలిపారు. ఎస్‌ఐ భక్తవత్సలం ప్రమాద విషయం తెలుసుకుని సంఘటనా స్థలానికి పోలీసు సిబ్బందితో చేరుకుని మృతదేహాన్ని రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వంద కోసం ఆశపడితే రూ.1.64లక్షలు చోరీ

పోరుమామిళ్ల, సెప్టెంబరు 21: కిందపడిన వంద నీదేనేమో తీసుకో అంటూ ఇద్దరు అపరిచితులు చెప్పి సుమారు 1.64లక్షలు చోరీ చేసినట్లు బాధితుడు ఫిర్యాదు చేసినట్లు పోరుమామిళ్ల ఎస్‌ఐ కొండారెడ్డి తెలిపారు. వివరాల్లోకెళితే....

శుక్రవారం బి.కోడూరు మండలం వాసి చెముడూరి చిన్నగురయ్య స్టేట్‌బ్యాంకు నుంచి రూ.1.64 లక్షలు డబ్బు డ్రా చేసుకుని బైకులో వెళుతున్నాడు. ఇంతలో ఇద్దరు అపరిచితులు అతన్ని అనుసరిస్తూ సీతారాంపురం క్రాస్ రోడ్డు వద్ద వంద రూపాయల నోటు కింద వేసి మీడబ్బు కింద పడిందని చెప్పగా ఆ నోటు తనదే అని భావించి దానిని తీసుకునేందుకు డబ్బు కోసం బైకు దిగగానే అతని వద్ద కవరులో ఉన్న డబ్బు బ్యాగు తీసుకుని వారు పలాయనం చిత్తగించారు శుక్రవారం రాత్రి 11గంటల ఫిర్యాదు ఇవ్వగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

సికెదిన్నె, సెప్టెంబరు 21: ఊటుకూరు సర్కిల్ వద్ద శనివారం కడప సివిల్ సప్లయ్ విజిలెన్స్ సీఐ హమీద్‌ఖాన్ ఆధ్వర్యంలో మైదుకూరు నుంచి బెంగుళూరుకు వెళుతున్న బియ్యం లారీని పట్టుకుని సికెదిన్నె పోలీసు స్టేషన్‌లో అప్పగించినట్లు సికెదిన్నె సీఐ శివశంకర్‌నాయక్ తెలిపారు. అక్రమంగా బెంగుళూరుకు తరలిస్తున్న ఏపీ16టీఈ 3219 లారీని పట్టుకుని అందులో 494 బస్తాలు పీడీఎస్ రైస్ వాటి విలువ రూ.11,25,624 ఉంటుందని 80 బస్తాల పీడీఎస్ నూకలు వీటి విలువ రూ.1,06,521గా ఉంటుందని వీటిని విజిలెన్స్ అధికారులు సికెదిన్నె స్టేషన్‌లో అప్పగించారన్నారు. మైదుకూరుకు చెందిన లారీ ఓనర్ సుధీర్‌కుమార్, మాచనూరు సుబ్బరాయుడుకు చెందినవిగా తెలిపారు. సికెదిన్నె పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేయడం జరిగిందన్నారు.

పోలీసులమని జాగ్రత్తలు చెప్పి చోరీ

ముద్దనూరు సెప్టెంబరు21: ' ఈ రోడ్డులో దొంగలు తిరుగుతుంటారు నగలు దోచుకుంటారు', జాగ్రత్తలు చెప్పి నగలు చోరీకి తెగబడ్డారు. సీఐ దస్తగిరి తెలిపిన మేరకు వివరాల్లోకెళితే.... బొందలకుంట వాసి పుల్లయ్య అతని భార్యతో కలిసి పని నిమిత్తం కడపకు వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో ముద్దనూరు నుంచి ద్విచక్ర వాహనంలో గ్రామానికి వెళుతుండగా మార్గ మధ్యలో నలుగురు వ్యక్తులు రెండు ద్విచక్ర వాహనాల్లో వచ్చి వాహనాన్ని ఆపారు. మేము పోలీసులము ఇక్కడ దొంగతనాలు జరుగుతున్నాయి. బంగారు నగలు జాగ్రత్తగా పెట్టుకోండి అన్నారు. వంటిపై నున్న బంగారు నగలు వారికి ఇవ్వగా పేపర్లో పెట్టి ఇచ్చారు. కొద్ది దూరం వెళ్లి చూడగా పేపర్లో బంగారు నగలు లేవు, గులక రాళ్లు ఉన్నాయి. వంటిపై ఉన్న బంగారు తాళి బొట్టు, ఉంగరాలు చోరీ అయినట్లు, బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

యూసీఐఎల్‌లో గ్రాండ్ హిందీ డే

వేముల, సెప్టెంబరు 21: తుమ్మలపల్లె యూనిట్‌లో గ్రాండ్ హిందీ డే సెలబ్రేషన్స్ నిర్వహించినట్లు యూసీఐఎల్ అధికారులు తెలిపారు. శనివారం నిర్వహించిన సమావేశంలో యూసీఐఎల్ అధికారులు మాట్లాడుతూ 14న ప్రారంభించి హిందీ ఎస్‌ఏ రైటింగ్, నోటింగ్, డ్రాఫ్టింగ్, రాత పద్యాలు, ప్రసంగం, లేఖ రాయడం, అనువాదం తదితర పోటీలు నిర్వహించారు. మైన్స్, మిల్, అకౌంట్స్, పర్చేజ్, స్టోర్, హెచ్‌పీయూ సీఆర్‌డీ, అడ్మినిస్ట్రేషన్, ఎస్టేట్, ఎలక్ట్రికల్ తదితర వివిధ విభాగాల కోసం యూసీఐఎల్ నాలుగు బృందాలు ఏర్పాటు చేయబడ్డాయన్నారు. సైన్స్, టెక్నాలజీ, ఆరోగ్యం, సాహిత్యానికి సంబంధించిన ప్రశ్నల ద్వారా పాల్గొనేవారు ప్రోత్సహించబడ్డారన్నారు. హిందీ భాషలో పాల్గొన్న వారందరికీ డిప్యూటీ జనరల్ మేనేజర్ (మిల్) సుమన్ సర్కార్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో న్యాయనిర్ణేతలు సోంజోయ్ ఛటర్జీ, లక్ష్మీ రంగయ్య, విపిన్ కుమార్‌శర్మ, డాక్టర్ పీకె తామ్రాకర్, ధరమ్‌వీర్‌యాదవ్, బీనా, హిమాన్షుతివారి, కుమారస్వామి, శ్రీహర్ష, సతీష్‌బిత్రా, వెంకటనరేంద్ర, సజీవ్ కుమార్‌శర్మ, అమ్జద్ అలీ, శివప్రసాద్, మేత్యానంద్, పికె నాయక్, బి. తారకేశ్వరరావు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ దరఖాస్తు గడువు పొడిగింపు

- అన్నమయ్య జిల్లా విద్యాశాఖాధికారి శివప్రకాశ్‌రెడ్డి

రాయచోటిటౌన్, సెప్టెంబరు21: ఓపెన్ స్కూల్ ప్రవేశాల కోసం 2024-25 విద్యా సంవత్సరం దరఖాస్తు చేసుకునేందుకు 28వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు అన్నమయ్య జిల్లా విద్యాశాఖాధికారి శివప్రకాశ్‌రెడ్డి, ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ కొండూరు శ్రీనివాసరాజులు తెలిపారు. రూ.200 అపరాధ రుసుముతో ఈ నెల 29, 30వ తేదీల్లో ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చన్నారు. అన్నమయ్య జిల్లాలో డ్రాపౌట్స్ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా టెన్త్, ఇంటర్ కోర్సుల్లో చేరగలిగే వయసు ఉన్న 754 మంది విద్యార్థుల డ్రాపౌట్స్ వివరాలు ఆయా మండలాల్లో పాఠశాలల వారీ ఎంఈఓల వద్ద ఉన్నాయని, అటువంటి విద్యార్థులందరినీ మండల కోఆర్డినేటర్‌లు తమ తమ ఓపెన్ స్కూల్స్ సెంటర్స్‌లో చేర్చుకోవడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్‌లు ఈ విషయాన్ని వారి పరిధిలో విస్తృతంగా ప్రచారం చేసి డ్రాపౌట్స్ విద్యార్థులు అందరూ ప్రవేశాలు పొందేలా ప్రయత్నించాలని ఒక ప్రకటనలో తెలిపారు.

బార్ అసోసియేషన్‌ను సందర్శించిన హైకోర్టు జస్టిస్



హైకోర్టు జస్టిస్ రామకృష్ణప్రసాద్‌కు సమస్యలను వివరిస్తున్న కడప బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి. గుర్రప్పనాయుడు, చిత్రంలో జిల్లా ప్రధాన జడ్జి జి.శ్రీదేవి తదితరులు

కడప(రూరల్) సెప్టెంబర్ 21: రాష్ట్ర హైకోర్టు జస్టిస్, జిల్లా పోర్ట్‌పోలియో జస్టిస్ జి. రామకృష్ణ ప్రసాద్ శనివారం కడప బార్‌అసోసియేషన్‌ను సందర్శించారు. అసోసియేషన్ అధ్యక్షుడు బి. గుర్రప్పనాయుడు, ప్రధాన కార్యదర్శి కెనడి, ఉపాధ్యక్షులు సి. చంద్రమోహన్ తదితరులు జిల్లా కోర్టు ఆవరణలో ఉన్న సమస్యలను జస్టిస్ దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా కోర్టు సముదాయంలో ఖాళీగా ఉన్న న్యాయమూర్తుల స్థానాలను భర్తీ చేయాలని, 2019లో డెమాలిష్ చేసిన స్థలంలో నూతన కోర్టుల సముదాయాన్ని నిర్మించేందుకు సత్వర చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జస్టిస్ వెంట జిల్లా ప్రధాన జడ్జి జి. శ్రీదేవి, ఆయాకోర్టుల జడ్జిలు, న్యాయవాదులు ఉన్నారు.

అలంకారప్రాయం.. ఇండోర్ స్టేడియం



మున్సిపల్ ఇండోర్ స్టేడియం

- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- ఐదేళ్లుగా ఏర్పాటు కాని కమిటీ
- పోటీలు నిర్వహించలేని దుస్థితి
- అధికారుల తీరుతో ఇబ్బంది
- ఆధునికీకరణకు నోచుకోని స్టేడియం

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 21: పట్టణ అభివృద్ధిలో భాగంగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేశారు. ఇందులో పట్టణ క్రీడాకారులు ఆహ్లాదకరంగా ఆడుతూ ఆటల్లో పటిమను పెంచుకునేవారు. అయితే అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో పోటీలు సైతం నిర్వహించలేని దుస్థితిలో కొట్టుమిట్టాడుతోంది. మున్సిపల్ ఇండోర్‌స్టేడియం తర్వాత పట్టణంలో ఏర్పాటు చేసిన ప్రైవేటు ఇండోర్ స్టేడియాలు క్రీడాకారులతో సందడిగా ఉంటే మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో క్రీడాకారులు లేకపోవడం, మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ లోపానికి అద్దం పడుతోంది.

క్రేజీ క్రీడల్లో బ్యాడ్మింటన్ ఒకటి. బ్యాడ్మింటన్ పట్ల యువతను ప్రోత్సహించడానికి అనిబీసెంట్ మున్సిపల్ హైస్కూలు మైదానంలో బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేశారు. 2012లోనే రూ.67 లక్షల మున్సిపల్ నిధులతో ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేశారు. తర్వాత స్టేడియంలో వివిధ అభివృద్ధి పనుల కోసం మరో రూ.10 లక్షల వరకు ఖర్చు చేశారు. ఇందులో సభ్యత్వానికి నెలకు రూ. 300 చెల్లించాల్సి ఉంది. మొదట్లో స్టేడియంలో 60 మంది సభ్యులు చేరారు. అయితే సగం మంది డబ్బు చెల్లించిన దాఖలాలు లేవు. అయితే స్టేడియంలో ఉదయం పూట సభ్యులు ఆడుకుంటే సాయంత్రం క్రీడాకారులు ఆడుకునే అవకాశం కల్పించారు. మొదట్లో నిర్వహణ బాగా సాగడంతో క్రీడాకారులు ఆడుకోవడానికి వచ్చేవారు. అంతేకాకుండా బయటి నుంచి వచ్చే క్రీడా కారులతో పోటీలు నిర్వహించేవారు. తర్వాత మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ కొరవడుతూ రాసాగింది. కరోనా నుంచి బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించలేని పరిస్థితి ఏర్పడింది. ఐదేళ్లగా స్టేడియం నిర్వహణకు కనీసం కమిటీని కూడా ఏర్పాటు చేయలేని దుస్థితిలో మున్సిపల్ అధికారులు ఉన్నారు. సభ్యుల ఫీజు రాకపోయినా మున్సిపాలిటీ మాత్రం నెల నెలా కరెం టు బిల్లు, బాయిస్ వేతనం, క్లీనింగ్ కోసం ఖర్చు చేస్తోంది.



పాతబడిన సింథటిక్ కోర్టు

కొరవడిన పర్యవేక్షణ

ఇండోర్ స్టేడియాన్ని తీర్చిదిద్దడంలో అధికారులు వెనుకంజ వేశారని చెప్పవచ్చు. సభ్యులను చేర్చుకున్న వారు తర్వాత కాలంలో సభ్యుల చేరికపై దృష్టిసారించలేదని చెప్పవచ్చు. అంతేకాకుండా ఉన్న సభ్యుల నుంచి నెల నెలా ఫీజును వసూలు చేయలేకపోయారు. ఫలితంగా స్టేడియంలో అత్యంత ఖరీదుతో చేపట్టిన ఉడెన్ ఫ్లోర్ దెబ్బతినింది. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో మున్సిపల్ స్టేడియం తర్వాత పట్టణంలో ఏర్పాటైన ప్రైవేటు స్టేడియాలు క్రీడాకారులతో సందడి జరుగుతున్నాయి. మరో విశేషమేమిటంటే చాలా మంది మున్సి పల్ సిబ్బంది సైతం ప్రైవేటు స్టేడియాల్లో సభ్యులు గా చేరారనే ఆరోపణలున్నాయి. మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో క్రీడాకారులు లేకపోవడం, మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ లోపానికి అద్దం పడుతోంది.



దెబ్బ తిన్న ఉడెన్ ఫ్లోర్

అనుమతి లేకుండా శిక్షణ

క్రీడాకారులకు శిక్షణ ఇవ్వాలంటే మున్సిపాలిటీ అనుమతి అవసరం. ప్రస్తుతం స్టేడియంలో అనుమతి లేకుండానే క్రీడాకారులకు శిక్షణ ఇస్తున్నట్లు ఆరోపణలున్నాయి. నెలకు సూమారు రూ.800 వరకు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. స్టేడియం నుంచి తగిన ఆదాయం రాకపోవడంతో మున్సిపల్ అధికారులు కూడా స్టేడియం నిర్వహణ పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారు. దాదాపు పదేళ్ల కిందట ఏర్పాటు చేసిన సింథటిక్ మ్యాట్‌పైనే ఆడుకుంటున్నారు. మ్యాట్ల పక్కన ఉన్న ఉడెన్‌ఫ్లోర్ దెబ్బతిన్నా పట్టించుకునేవారు లేకపోవడంతో క్రీడాకారులు సర్దుకు పోతున్నారు. ఎప్పుడో వేసిన రంగులు వెలిసినా పట్టించుకోవడంలేదు. స్టేడియాన్ని ఆధునికీకరించాలన్న ధ్యాస కూడా అధికారులకు లేకుండాపోయింది.

అధికారుల ఆదేశాలను పట్టించుకోని వైనం

మున్సిపల్ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడిని అధికారులు ఇండోర్ స్టేడియంలో కోచ్‌గా నియమించారు. వైసీపీ ప్రభుత్వంలో ఉపాధ్యాయులందరినీ విద్యాశాఖ పరిధిలోకి తేవడంతో కోచ్‌గా వ్యవహరిస్తున్న ఆ వ్యాయామ ఉపాధ్యాయుడు మున్సిపల్ అధికారుల ఆదేశాలను పట్టించుకోవడం లేదని సమాచారం. ఆ వ్యాయామ ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులు డీఈఓకు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. అధికారులు స్టేడియంను ఆధునికీకరించి శిక్షణ ఇవ్వాలని, పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు ఉచితంగా శిక్షణ పొందే అవకాశం కల్పించాలని క్రీడాకారులు కోరుతున్నారు.

స్టేడియం కమిటీ ఏర్పాటుకు చర్యలు

ఇండోర్ స్టేడియం కమిటీ ఏర్పాటుకు మున్సిపల్ కమిషనర్ చర్యలు తీసుకుంటున్నారు. తాను కోచ్‌గా వచ్చిన తర్వాత పైకప్పు కారకుండా రిపేర్లు చేయించా. స్టేడియం సభ్యులు కొందరు నెల నెలా డబ్బులు చెల్లించలేదు. చాలా కాలం నుంచి బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించడంలేదు. క్రీడాకారులు షటిల్ బ్యాట్ ప్రాక్టీసు చేసుకోవడానికి మిషన్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు పంపితే కొందరు అధికారులు అడ్డుకున్నారు. కోచింగ్‌కు కొద్దిమంది క్రీడాకారులే వస్తున్నారు.

రాఘవ, బ్యాడ్మింటన్ కోచ్



రంగులు వెలసిన గోడలు

దారి దోపిడీ ముఠా గుట్టు రట్టు

ఒకటిన్నర కిలో గంజాయి స్వాధీనం ● ఎనిమిది మంది యువకుల అరెస్టు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ

కమలాపురం రూరల్, సెప్టెంబరు 21: దారికాచి దోపిడీ చేస్తున్న ముఠా గుట్టును కమలాపురం పోలీసులు రట్టు చేశారని కడప ఇన్‌చార్జ్ డీఎస్పీ రమాకాంత్ తెలిపారు. పోలీసుస్టేషన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ముఖ్యమైన రహదారుల్లో ప్రయాణించే లారీలను ఆపి డ్రైవర్లను కొట్టి కత్తులతో బెదిరించి డబ్బు, సెల్‌ఫోన్లను లాక్కునిపోయే గ్యాంగ్‌ను ఎస్పీ ఆదేశాల మేరకు స్వీయ పర్యవేక్షణలో పట్టుకున్నారని తెలిపారు. గంగవరం ఆర్చి వద్ద వినోద్‌కుమార్, సాయి ప్రశాంత్, ఉదయ్‌కుమార్ ఉన్నట్లు అందిన సమాచారంతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కడప సీసీఎస్ సీఐ భాస్కర్‌రెడ్డి, కమలాపురం సీఐ రోషన్, ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి, వల్లూరు ఎస్‌ఐ సంజీవరాయుడు తమ సిబ్బంది శనివారం ఉదయం 9గంటలకు వారిని పట్టుకుని పోలీసుస్టేషన్‌కు తరలించి క్రిమినల్ కేసు నమోదు చేశామన్నారు. చాపాడు మండలం పల్లవోలు వాసి వినోద్‌కుమార్ చెడు వ్యసనాలకు అలవాటు పడి సులభంగా డబ్బు సంపాదించడం కోసం చాపాడు మండలంలోని ఓ ఇంజనీరింగ్ కాలేజీలో చదివే గుజ్జుల సాయి ప్రశాంత్, ఉదయ్‌కిరణ్, మురళీధర్, ఆదికేశవరెడ్డి, వెంకటసుబ్బయ్య, నరహరితో పరిచయం చేసుకున్నాడు. వీరికి గంజాయి అలవాటు చేసి వారితో కలిసి ఒక గ్యాంగ్‌గా ఏర్పడి రాత్రి సమయంలో జిల్లాలోని పలు మండలాల్లో భారీ దోపిడీ చేసినట్లు నిర్ధారణ అయిందన్నారు. లారీ డ్రైవర్లను కత్తులు చూపిస్తూ చంపుతామని బెదిరిస్తూ వారి వద్ద నుంచి డబ్బు, సెల్‌ఫోన్లు లాక్కుని వెళ్లేవారని తెలిపారు. ఈ నెల 2న చాపాడు పోలీసుస్టేషన్‌పరిధిలో సెల్‌ఫోను రూ.9వేలు, 15న ఒంటిమిట్ట స్టేషన్ పరిధిలో ఒక మొబైల్ ఫోను రూ.15వేలు దోచుకున్నట్లు తెలిపారు. 18న వల్లూరు పరిధిలో ఒక మొబైల్ రూ.3500 దోచుకున్నారు. 20న ముద్దనూరు పోలీసుస్టేషన్ పరిధిలో రెండు మొబైల్‌ఫోన్లు 10 గ్రాముల ఉంగరం, రూ.14800 డబ్బు దోచుకున్నారు. అదే రోజు రాత్రి ఎర్రగుంట్ల పోలీసుస్టేషన్ పరిధిలో రూ.7500 నగదు సెల్‌ఫోను, కమలాపురం పోలీసుస్టేషన్ పరిధిలో రూ.4500 నగదు దోచుకున్నట్లు విచారణలో తేలింది. కాగా రూ.14800 డబ్బు, 8 సెల్ ఫోన్లు, 3 బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ కేసులో పనిచేసిన సీఐ, ఎస్‌ఐ పోలీసు సిబ్బందికి రివార్డు ఇచ్చేందుకు ఎస్పీకి రెఫర్ చేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కలమల్ల పోలీసుపై వేటు

ఎర్రగుంట్ల, సెప్టెంబరు 21: కలమల్ల పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న శివను ఎస్పీ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. మూడేళ్లగా శివ ఇక్కడ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నట్లు ఎస్‌ఐ తిమోతి తెలిపారు. ఇటీవల ప్రొద్దుటూరు రూరల్ పరిధిలోని దొరసానిపల్లెలో పోలీసులు దాడులు చేసి 17మందిని జూదరులను అరెస్టు చేశారు. అందులో కానిస్టేబుల్ కూడా ఉన్నాడు. ఈ విషయంపై సీరియస్ అయిన ఉన్నతాధికారులు శనివారం అతనిపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటూ సస్పెండ్ చేశారు.

ఏడుగురు జూదర్ల అరెస్టు

- రూ.75,800 నగదు, కారు, బైక్, రెండు స్కూటీలు, 8 సెల్‌ఫోన్లు స్వాధీనం

కడప (క్రైం), సెప్టెంబరు 21: చిన్నచౌకు పోలీసుస్టేషన్ పరిధిలో జూదమాడుతున్న ఏడు గురిని అరెస్టు చేసినట్లు సీఐ తేజమూర్తి తెలిపారు. పేకాడుతున్నట్లు సమాచారం రావడంతో శనివారం ఎస్పీ ఆదేశాల మేరకు కడప సబ్ డివిజన్ ఇన్‌చార్జ్ డీఎస్పీ రమాకాంత్ పర్యవేక్షణలో శ్రీక్రిష్ణ ఇన్ లాడ్జి పక్కన పేకాడుతున్న ఏడుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.75,800 నగదు, కారు, మోటారు సైకిల్, రెండు స్కూటీలు, 8 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

15 మంది జూదరుల అరెస్ట్...

రాజంపేట టౌన్, సెప్టెంబరు 21: బోయనపల్లె అరుంధతీవాడ సమీపంలో పేకాడుతున్న 15 మంది జూదరులను మన్నూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సీఐ రామాంజనేయుడు తెలిపారు. ముళ్లపొదల్లో పేకాడుతున్న సమాచారం అందడంతో సిబ్బంది పేకాట స్థావరంపై దాడులు చేశారు. వారి నుంచి రూ.50 వేల పైచిలుకు మొత్తాన్ని స్వాధీన పరుచుకున్నట్లు సీఐ తెలిపారు. సిబ్బంది అంజిరెడ్డి, రవికుమార్, చంద్రమోహన్ నాయుడు, చంద్ర, బాబు, ప్రసాద్, ఆంజనేయులు, రమణ పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు కింద పడి వ్యక్తి మృతి

ఖాజీపేట, సెప్టెంబరు 21: ప్రమాదవశాత్తు కిందపడి రావులపల్లె వాసి గంగవరం శ్రీనివాసులరెడ్డి (72) మృతిచెందాడు. బంధువుల కథనం మేరకు.... శ్రీనివాసులరెడ్డి పని నిమిత్తం పొలం దగ్గరకు వెళ్లి తిరిగి వస్తుండగా నీటిలో పడి శుక్రవారం మృతిచెందాడు. అయితే కుటుంబీకులు ఎవరూ లేకపోవడంతో ఎక్కడికైనా వెళ్లాడేమోనని బంధువులు అనుకున్నారు. చివరకు అనుమానం వచ్చి పొలం వద్ద నీటిలో మృతదేహం తేలియాడుతూ కన్పించడంతో శవపరీక్ష నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు.

పెద్దనపాడులో ఘర్షణ

ఎర్రగుంట్ల, సెప్టెంబరు 21: పెద్దనపాడులో ఘర్షణ జరిగినట్లు సమాచారం. గ్రామానికి చెందిన శిరిగిరెడ్డి శివరామిరెడ్డి టీడీపీకి చెందిన కే.శ్రీనివాసరెడ్డిపై దాడిచేసినట్లు సమాచారం. ఈ దాడిలో శ్రీనివాసరెడ్డికి గాయాలు కాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పాత కక్షలుకూడా ఈ ఘర్షణకు కారణాలుగా చెబుతున్నారు.

రెండు లారీలు ఢీ- డ్రైవరుకు గాయాలు

కడప (క్రైం), సెప్టెంబరు 21: దేవునికడప బైపాస్‌రోడ్డులో శనివారం రాత్రి రెండు లారీలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఓ లారీ డ్రైవరు గాయపడ్డాడు. వాహనాలు భారీగా నిలిచిపోవడంతో చిన్నచౌకు సీఐ తేజమూర్తి ట్రాఫిక్‌ను క్లియర్ చేయించారు. డ్రైవరును రిమ్స్‌కు తరలించారు.

ఆర్టీపీపీలో చోరీ

ఎర్రగుంట్ల, సెప్టెంబరు 21: ఆర్టీపీపీలోని వీఏటెక్ కంపెనీలో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని దొంగలు సామాన్లు, ఇనుప వస్తువులు చోరీ చేసినట్లు కలమల్ల పోలీసులు తెలిపారు. వీటి విలువ సుమారు రూ.2,42,000 ఉంటుందన్నారు. కేసునమోదు చేసినట్లు పేర్కొన్నారు. కాగా చోరీకి గురైన సామగ్రి దొరికినట్లు సమాచారం. ఈవిషయంపై కొందరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది.

దసరా సెలవులను రివైజ్ చేయాలి

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 21: దసరా సెలవులను రివైజ్ చేయాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సీవీ ప్రసాద్, కడప, అన్నమయ్య జిల్లాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఈశ్వరచంద్ర, అలీఖాన్, చెంగల్‌రెడ్డి, ఉమాకాంత్ డిమాండ్ చేశారు. మహాలయ అమావాస్య విశిష్టత గుర్తించి దసరా సెలవులను అక్టోబరు 3 నుంచి ప్రకటించాలని కోరారు. గతంలో మాదిరి దసరా సెలవులను పునరుద్ధరించాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం కేసు నమోదు

సుండుపల్లె, సెప్టెంబరు21: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఒక ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. పింఛా ప్రాజెక్టు దిగువ భాగం నుంచి తరలిస్తున్నట్లు స్థానికులు ఇచ్చిన సమాచారంతో పట్టుకుని కేసు నమోదు చేశామన్నారు.

దాడిలో వ్యక్తికి తీవ్రగాయాలు

వీరబల్లి, సెప్టెంబరు21: వనంకాడపల్లి హరిజనవాడకు చెందిన భూపాల్‌పై అదే గ్రామానికి చెందిన రమణ, నాగేంద్ర శుక్రవారం కొడవలితో దాడి చేయడంతో తలకు గాయమైంది. పాతకక్షలతో భూపాల్‌పై వారిద్దరూ దాడి చేయడంతో ఈ ఘర్షణ జరిగిదని ఎస్‌ఐ మోహన్ నాయక్ తెలిపారు. భూపాల్‌ను చికిత్స కోసం రాయచోటికి తరలించగా శస్త్ర చికిత్స నిమిత్తం తిరుపతికి తరలించినట్లు ఆయన చెప్పారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

ఎర్రగుంట్ల, సెప్టెంబరు 21: ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్‌లో అక్రమంగా తీసుకెళుతున్న మద్యం బాటిళ్లను శుక్రవారం అర్ధరాత్రి పోలీసులు పట్టుకున్నట్లు సమాచారం. తమిళనాడు రాష్ట్రం 90 హాఫ్ బాటిల్స్, 26 ఫుల్ బాటిల్స్ ఉన్నట్లు తెలిసింది. కేసు నమోదు చేసినట్లు సమాచారం.

వీసీని తొలగించాలని లేఖ

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 21 : వైవీయూ ఇన్‌చార్జ్ వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు క్రిష్టారెడ్డిని తొలగించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి గంగాసురేశ్ డిమాండ్ చేశారు. శనివారం గవర్నరుకు లేఖ రాశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉన్నత పదవులకు అర్హత ఒక్కటే ప్రామాణికం కాదని, వారి వ్యక్తిత్వం కూడా చూసి వారికి పదవులు ఇవ్వాలని కోరారు.

ప్రత్యామ్నాయ పంటలే మేలు

సీకేదిన్నె, సెప్టెంబరు 21: రైతులు వర్షాధార ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలని ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ అంకయ్యకుమార్ తెలిపారు. కమ్మవారిపల్లె పంచాయతీ గోర్లపల్లె గ్రా మంలో రైతులు వెంకటరెడ్డి, బాస్కర్‌రెడ్డిల పొలాల్లో శనివారం క్షేత్ర దినోత్సవాన్ని నిర్వహించారు. కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ వీరయ్య, ఏఓ ఈశ్వర్‌రెడ్డి, పాపాసాహెబ్‌పేట రైతు సేవా కేంద్రం విస్తరణాధికారి గిరిబాబు పాల్గొన్నారు.

'హామీలను అమలు చేయాలి'

కడప(కలెక్టరేట్), సెప్టెంబరు 21: కూటమి ప్రభుత్వం హామీలను అమలు చేయాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు విజయజ్యోతి పేర్కొన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికి కేవలం పింఛన్లు మాత్రమే అందించారన్నారు.

'పద్ధతి మార్చుకోండి.. లేదంటే తాట తీస్తా'


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న రమాకాంత్

కడప (క్రైం), సెప్టెంబరు 21 : మీ పద్ధతి మార్చుకోవాలని, లేకుంటే తాట తీస్తానని కడప ఇన్‌చార్జ్ డీఎస్పీ రమాకాంత్ రౌడీషీటర్లకు హెచ్చరించారు. కడప టూటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో శనివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీ కదలికలపై నిఘా ఉంటుందని, సత్ప్రవర్తన కలిగి శాంతియుతంగా జీవించే వారికి పోలీసు సహకారం ఉంటుందన్నారు.

ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి

కడప (క్రైం), సెప్టెంబరు 21 : ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని మహిళా పీఎస్ సీఐ క్రిష్టారెడ్డి విద్యార్థులకు సూచించారు. శనివారం నగరంలోని శ్రీహరి డిగ్రీ కళాశాల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో అత్యున్నత స్థాయికి ఎదిగేలా భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని క్రిష్టారెడ్డి విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ ఇన్‌స్పెక్టరు రాజు, ఎస్ఐ శాంతమ్మ, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు

శ్రీవారి లడ్డూ కల్తీ విషయంలో నిజనిర్ధారణ చేపట్టాలి

● వీహెచ్‌పీ నాయకులు రామ్‌మహేష్

కడప (కల్చరల్), సెప్టెంబరు 21: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ జరిగిందనే అంశంపై సీబీఐతో గానీ సుప్రీంకోర్టుతో గానీ నిజనిర్ధారణ చేపట్టాలని విశ్వహిందూ పరిషత్ నాయకుడు రామ్‌మహేష్ ప్రభుత్వాలను కోరారు. శనివారం స్థానిక పాత బస్టాండు వద్ద గల గాలిదేవర ప్రసన్నాంజనేయస్వామి సన్నిధిలో గల వీహెచ్‌పీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో స్వామివారి ప్రసాదం 110 రకాలుగా భక్తులకు అదించేవారన్నారు. ప్రస్తుతం రకాలు తగ్గడంతో పాటు ఏదేని స్వామివారి ప్రసాదం 10 నిమిషాల కంటే ఎక్కువ సమయం భక్తులకు అందడం లేదన్నారు.

లడ్డూను అపవిత్రం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

వేంపల్లె, సెప్టెంబరు 21: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ చేసి అపవిత్రం చేసిన వారిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కూటమి నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వారు ఎస్ఐ తిరుపాల్‌నాయక్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ మాట్లాడుతూ నేరస్తులను శిక్షించాలని కోరారు.

ఫీజు రీయింబర్స్‌మెంటు విడుదల చేయాలి

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 21: ఫీజు రీయింబర్స్‌మెంటు విడుదల చేయాలని ఏబీవీపీ జిల్లా కన్వీనరు మాణిక్యరాజు డిమాండ్ చేశారు. శనివారం కడప నగరం వైజంక్షన్ సర్కిల్‌లో ఏబీవీపీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు ప్రశాంత్‌కుమార్, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన మండల స్థాయి క్రీడలు

కడప (స్పోర్ట్స్), సెప్టెంబరు 21: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక డిస్ట్రిక్ స్పోర్ట్స్ అథారిటీ (డీఎస్ఏ) ఇండోర్ స్టేడియంలో కడప మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. ఇందులో మొదటి రోజైన శనివారం యోగా, చెస్‌లలో పోటీలు నిర్వహించారు. 14 సంవత్సరాల నుంచి 17 ఏళ్ల లోపు గల బాల, బాలికలు ఈ పోటీలలో పాల్గొన్నారు.

సీకేదిన్నె: చింతకొమ్మదిన్నె మండలంలో ఎస్‌జీఎఫ్ఐ టోర్నమెంట్ మండల స్థాయి ఎంపికలు సోమవారం నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ వెంకటరామిరెడ్డి, మండల కో ఆర్డినేటర్ రుద్రమూర్తియాదవ్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటలకు అండర్-14, 17 బాలబాలికలకు 9 రకాల క్రీడలు నిర్వహిస్తామన్నారు. అండర్-14 వారి వయస్సు 1.1.2011 తర్వాత పుట్టి ఉండాలని, అండర్-17 1.1.2008 తర్వాత పుట్టినవారై ఉండాలన్నారు.

రెండోరోజూ వైద్యుల నిరసన

కడప (సెవెన్‌రోడ్స్), సెప్టెంబరు 21:జీఓ నెం.85ను రద్దు చేయాలని కోరుతూ రెండరోజైన శనివారం డీఎంహెచ్ఓ కార్యాలయం ఎదుట జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల వైద్యులు నోటికి రిబ్బన్ కట్టుకుని శాంతియుత నిరసన తెలిపారు. జీఓ నెం.85 వల్ల గ్రామాల్లో పీహెచ్‌సీలలో సేవలందిస్తున్న ఎంబీబీఎస్ వైద్యులు ఉన్నత విద్యకు దూరం అవుతారని, ఇది వాళ్ల హక్కులను కాలరాసినట్లేనన్నారు.ఈ కార్యక్రమంలో ఏపీపీహెచ్‌సీడీఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాఘవేంద్ర, జనరల్ సెక్రటరీ వినయ్‌కుమార్, కోశాధికారి మహ్మద్ తాహా, మరియు ఇతర పీహెచ్‌సీ సిబ్బంది వైద్యులు పాల్గొన్నారు.

వడ్డీ వ్యాపారి బీభత్సం

కడప (క్రైం), సెప్టెంబరు 21: కడప నగరం మరాఠీ వీధిలో ఓ వడ్డీ వ్యాపారి బీభత్సం సృష్టించాడు. రుణం తీసుకున్న వారి ఇంటికెళ్లి తాళాలు పగలగొట్టడంతో పాటు ఇంటి ఆవరణంలోని సామగ్రిని ధ్వంసం చేశాడు. ఈ విషయమై తాలూకా సీఐని వివరణ కోరగా ఈ విషయమై ఇరువురు ఫిర్యాదు చేశారని, విచారిస్తున్నామని పేర్కొన్నారు.

మహమ్మద్ ప్రవక్త అడుగుజాడల్లో నడవాలి

కడప, వినాయకనగర్, సెప్టెంబరు21: మహమ్మద్ ప్రవక్త హల్లులాహు లహైసీ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని 28వ డివిజన్ టీడీపీ నేత అబ్దుల్లా పేర్కొన్నారు. నగరంలోని ముచ్చరవీధిలో ఉన్న ఉర్దూ పాఠశాలలో మిలాద్ ఉన్ నబీ సందర్భంగా క్లీరతుబ్‌నబీ కార్యక్రమాన్ని చేపట్టారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం దాహుద్, ఉపాధ్యాయులు మహబూబ్‌బాషా, ఫక్రుద్దీన్, యాస్మిన్, సుల్తానా, భాగ్యలక్ష్మి, శ్వేతారెడ్డి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘన జీవామృతం తయారీ విధానంపై రైతులకు అవగాహన

వేముల, సెప్టెంబరు 21: మండలంలోని వి.కొత్తపల్లె గ్రామంలో రైతులకు ఘనజీవామృతం తయారీపై శనివారం అవగాహన కల్పించారు. మాస్టర్ ట్రైనర్ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ తయారైన ఘన జీవామృతాన్ని ఏ పంటకైన పంట పెట్టే ముందు పంట పెట్టిన తర్వాత మొక్కకు అందించడం వలన భూమి సారవంతమై మొక్కకు అన్ని రకాల పోషకాలు తీసుకొని మంచి పంటలుపండుతాయన్నారు.

వేంపల్లె పంచాయతీలో అవినీతిపై విచారణ

వేంపల్లె, సెప్టెంబరు 21: వేంపల్లె మేజర్ గ్రామ పంచాయతీలో 2017, 2018 సంవత్సరాల్లో అవినీతి జరిగిందని కలెక్టర్‌కు టీడీపీ మండల కన్వీనర్ రామమునిరెడ్డి ఫిర్యాదు చేయడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు డీఎల్పీఓ విజయభాస్కర్ ఆధ్వర్యంలో విచారణకు కమిటీని నియమించారు. కమిటీలోని కార్యదర్శులు బషీర్, మాధవ్‌రెడ్డి, శ్రీనివాసులు శనివారం వేంపల్లె పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించారు. ఈఓ సుబ్బారెడ్డితో మాట్లాడారు. పూర్తిస్థాయి రికార్డులు సోమవారం అప్పగిస్తామని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు.

ఎత్తిపోయిన వేరుశనగ..
ఎండిపోయిన నారుమడి

వాన దేవుడి కరుణ లేదు.. నేలపై చుక్క నీరు లేదు.. భూమి పగుళ్లు తీసింది.. నీటి మట్టం పడిపోయింది. బోర్లు ఎండిపోయాయి.. వేరుశనగ కాయపట్టే దశలో ఎండిపోయింది.. నారుమళ్లను వదిలేశారు.. అన్నదాతల ఆశలు అడియాశలయ్యాయి.. పంట పెట్టుబడికి తెచ్చిన అప్పు తడిసి మోపెడైంది. దీంతో రైతులు మరిన్ని అప్పుల్లో కూరుకుపోయారు. ఓ వైపు అప్పులోళ్ల బాధ, మరో వైపు పూట గడవక వారికి దిగులే కూడైంది. ప్రభుత్వం చేయూతనివ్వకపోతే బతికేది కష్టమని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. చక్రాయపేట మండలంలో పరిస్థితి ఇదీ...



మారెళ్లమడక వద్ద నీరు లేక ఎండిపోయిన నారు.. ఎర్రగుడిలో ఎండిపోయిన వేరుశనగ

చక్రాయపేట, సెప్టెంబరు 21: చక్రాయపేట మండలాన్ని కరువు కాటేసింది. వరుణదేవుడు కరుణించకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటి పంటలు ఎండిపోతున్నాయి. ఆ ఎండిపోయిన పైరు పశువులకు మేతకు అయినా పనికొస్తుందని రైతులు తొలగిస్తున్నారు. రైతులు ఆరుగాలం కష్టపడి చెమటోడ్చి అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి పైరు సాగుచేసినా రైతులకు మిగిలేది ఏమీ లేదు. ఈ ఏడాది తొలిదశలో సకాలంలో వర్షాలు రావడంతో వేరుశనగ సాగుచేశారు. వరుణుడు ముఖం చాటేయడంతో పైర్లు ఎండిపోతున్నాయి. వరుణదేవుడు మేఘాల మధ్య దోబూచులాడుతున్నాడు. ఇంతవరకు చినుకు లేదు. అప్పు చేసి పంటలు సాగుచేసినా చివరకు మిగిలేది మరింత అప్పే. దీంతో రైతులు కుటుంబాన్ని ఎలా పోషించాలా.. అనే ఆలోచనలో పడిపోయారు. వ్యవసాయం జూదంగా మారిపోయిది. మండలంలోని కల్లూరుపల్లె, ఎర్రగుడి, చిలేకాంపల్లె, గడ్డంవారిపల్లె, నెర్సుపల్లె, చక్రాయపేట, గొట్లమిట్ల, మహదేవపల్లె తదితర ప్రాంతాలలో పంటలు తీవ్రంగా ఎండిపోయాయి. నెర్సుపల్లె సమీపంలో ఎండిపోయిన వేరుశనగ పంట పశువులకు అయినా ఉపయోగపడుతుందని రైతులు అంటున్నారు. యార్లవాండ్లపల్లె సమీపంలో ఓబులేసు అనే రైతు బోరును నమ్మి ఐదు ఎకరాలు సాగుచేశాడు. వర్షం రాకపోవడంతో భూగర్భజలాలు అడుగంటి కాయ దశలో ఉన్న వేరుశనగ పూర్తిగా ఎండిపోయింది. కళ్లముందే ఎండుతున్న పంటను చూసి తట్టుకోలేక సుమారు రెండున్నర కిలోమీటర్ల దూరంలో ఉన్న ఓ బోరు వరకు పైపులు వేసి తన పైరుకు నీరందించాడు. అంతలోనే ఆ బోరు మోటార్ కాలిపోయింది. దీంతో ఓబులేసు బోరు యజమానికి రూ.38 వేలు ఇచ్చారు. చేసేది లేక పంటను వదిలేశాడు. దీంతో ఇటు డబ్బు, అటు శ్రమ వృథా అయింది.

ఐదు ఎకరాల్లో లక్ష నష్టం వచ్చింది



నాకు మూడు ఎకరాల పొలం ఉంది. మరో రెండు ఎకరాలు కౌలుకు తీసుకున్నాను. పంట సాగుకు లక్ష రూపాయల ఖర్చు వచ్చింది. వాన లేక పంట ఎండిపోతుంటే తిమ్మారెడ్డిగారిపల్లె సమీపాన ఓ రైతును అడిగి పైపులు వేసి నీరు తెప్పించేందుకు ప్రయత్నించాను. ఇంతలో మోటార్ కాలిపోవడంతో అదనంగా రూ.38 వేలు ఖర్చు వచ్చింది. పంట పూర్తిగా పోవడంతో అప్పులపాలయ్యా. ప్రభుత్వమే ఆదుకోవాలి.

- ఓబులేసు, యార్లవాండ్లపల్లె, చక్రాయపేట మండలం


అడుగంటిన బోరు

సాంఘిక దురాచారాలపై ఎలుగెత్తిచాటిన గురజాడ: రిజిస్ట్రార్

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 21 : గురుజాడ తన రచనలు, నాటకాల ద్వారా సమాజంలో ఉన్న దురాచారాలను ఎలుగెత్తి చాటి చెప్పారని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ రాజేశ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం యూనివర్సిటీలో గురుజాడ వెంకట అప్పారావు జయంతిని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల భాష వెలుగులోకి రావాల్సిన ఆవశ్యకతను తెలియజెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో నేషనల్ ఈవెంట్ కో ఆర్డినేటరు మనోహర్‌రావు, పీడీ ప్రసాదరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో... కడప నగరం ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ మహిళా డిగ్రీకళాశాలలో గురజాడ జయంతిని నిర్వహించారు. ప్రొఫెసరు మూలమల్లికార్జునరెడ్డి హాజరై మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సలీంబాషా, డాక్టర్ ఎం.గురుమోహన్‌రెడ్డి, తెలుగుశాఖాధిపతి వీరయ్య, డాక్టర్ ఎంవీ నాగసుధారాణి, ప్రకాశ్‌నాయణరెడ్డి పాల్గొన్నారు.

యూటీఎఫ్ ఆధ్వర్యంలో... గురజాడ నవయుగానికి అడుగుజాడ అని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేశ్‌బాబు తెలిపారు. యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో గురజాడ జయంతి వేడుకలు నిర్వహించారు.

నవయుగ వైతాళికుడు గురజాడ

వీరపునాయునిపల్లె, సెప్టెంబరు 21: గురజాడ అప్పారావు నవయుగ వైతాళికుడని పాయసంపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మురళీకృష్ణ కొనియాడారు. శనివారం జడ్పీ హైస్కూల్లో జేవీవీ ఆధ్వర్యంలో గురజాడ అప్పారావుజయతి కార్యక్రమం నిర్వహించారు.

ఆధునిక అడుగుజాడ గురజాడ

కడప (సెవెన్‌రోడ్స్), సెప్టెంబరు 21 : వాడుక భాషకు జీవం పోసి కన్యాశుల్కం లాంటి రచనలు చేసిన గురజాడ ఆధునిక రచయితలెందరికో అడుగుజాడలయ్యారని తెలుగుభాషోపాధ్యాయుడు డాక్టర్ జీవీ సాయిప్రసాద్ కొనియాడారు. వైవీయూ ఆధ్వర్యంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో గురజాడ అప్పారావు జయంతిని పురస్కరించుకుని గురజాడ సాహిత్యం సమకాలీన సమాజం అనే అంశంపై కార్యక్రమం నిర్వహించారు.

డబ్బు విషయమై ఘర్షణ - కేసు నమోదు

కడప (క్రైం), సెప్టెంబరు 21 : కడప నగరం సాయిపేటలో కుటుంబ, ఆర్థిక విషయమై జరిగిన ఘర్షణలో ఇనోస్, మరో ఇద్దరిపై దాడిచేసి గాయపర్చినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. ఇనోస్, ఇంతియాజ్‌లు ఇద్దరు బంధువులు. వీరి మధ్య కొంత కాలంగా మనస్పర్థలు న్నాయి. ఇంతియాజ్ కార్పొరేటర్ రఫి మరికొందరితో కలిసి ఇనోస్‌పై దాడి చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

లారీ బోల్తా - డ్రైవర్ మృతి



సీకేదిన్నె, సెప్టెంబరు 21:గువ్వలచెరువు ఘాట్‌లో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ సంఘటనా స్థలంలోనే దుర్మరణం చెందాడు. సీకేదిన్నె పోలీసుల వివరాల మేరకు.. రాయచోటి నుంచి కడప వైపునకు వస్తున్న ఎరువుల లారీ గువ్వలచెరువు ఘాట్‌లో బోల్తా పడింది. డ్రైవర్ మృతి చెందగా క్లీనర్‌కు గాయాలయ్యాయి. 108లో రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కంపోస్టు యూనిట్‌తో బహుళ ప్రయోజనాలు

కడప (ఎర్రముక్కపల్లె),సెప్టెంబరు21 :కంపోస్టు యూనిట్‌లో బహుళ ప్రయోజనాలు ఉన్నాయని ప్రొఫెసరు క్రిష్టారెడ్డి పేర్కొన్నారు. శనివారం వైవీయూ బాలికల హాస్టలు ప్రాంగణంలో కంపోస్టు యూనిట్‌ను వైస్‌చాన్సలరుతో పాటు చీఫ్ వార్డెన్ ప్రొఫెసరు రఘునాథరెడ్డి, పర్యావరణ ఇంజనీరు రవీంద్రనాథరెడ్డి ప్రారంభించారు.

గృహ నిర్మాణ లక్ష్యాలను సాధించాలి: కలెక్టర్

కడప(కలెక్టరేట్), సెప్టెంబరు 21: గృహ నిర్మాణ లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ శివశంకర్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని సభాభవన్‌లో హౌసింగ్ పీడీ కృష్ణయ్యతో కలిసి జిల్లాలోని ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, డీఈలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఆర్థిక సంక్షోభంలోనూ అద్భుత పాలన



చెన్నూరు ఉప్పరపల్లెలో మాట్లాడుతున్న కమలాపురం ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి... ప్రజల నుంచి సమస్యలు తెలుసుకుంటున్న కడప ఎమ్మెల్యే మాధవి

● అందుకే ఇది మంచి ప్రభుత్వం : ఎమ్మెల్యే

చెన్నూరు, సెప్టెంబరు 21: ఆర్థిక సంక్షోభంలోనూ అద్భుత పాలన అందించడం ఒక్క చంద్రబాబుతోనే సాధ్యమని, అందుకే ఇది మంచి ప్రభుత్వమని ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి అన్నారు. శనివారం ఉప్పరపల్లెలో 'ఇది మంచి ప్రభుత్వం.. ఎందుకంటే..' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 16437ఖాళీలకు మెగా డీఎస్సీ నిర్వహించేందుకు సంతకం చేయడంతో పాటు జూలై 1 నుంచే పింఛను రూ.4వేలు పెంచి అందిస్తున్న గొప్ప నేత చంద్రబాబు అన్నారు. పేదలకు అన్నం పెట్టే అన్న క్యాంటీన్లను పునఃప్రారంభించారన్నారు. చెన్నూరు మండలానికి కూడా అన్నక్యాంటీన్ మంజూరైందని, త్వరలో ప్రారంభిస్తామన్నారు. ల్యాండ్ టైటలింగ్‌యాక్ట్ రద్దు చేసి రైతుల్లో మనోధైర్యం నింపారన్నారు. చెన్నూరుకు రూ.4కోట్లు, ఉప్పరపల్లె పంచాయతీకి 40 లక్షలు మంజూరైందన్నారు. నాయకులు ప్రజలకు చేరువై వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలన్నారు. కొప్పర్తి పారిశ్రామికవాడకు కేంద్ర ప్రభుత్వం రూ.2300 కోట్లను మంజూరు చేసిందని, ఇది చంద్రబాబు ఘనతేనన్నారు. ఈ పరిశ్రమ ద్వారా 54 వేల మందికి ఉద్యోగ అవకాశాలు దొరుకుతాయన్నారు. జీఎన్ఎస్ఎస్ ద్వారా నీరు వస్తుందని, ఫలితంగా నియోజకవర్గంలోని ఆరు మండలాలు సస్యశ్యామలం అవుతాయన్నారు. కమలాపురం నియోజకవర్గాన్ని ఉన్నత స్థానంలో నిలపాలన్నదే తన ధ్యేయమన్నారు. టీడీపీ సీనియర్ నేతలు రామకోటిరెడ్డి, రామచంద్రారెడ్డి, మండల ప్రత్యేక అధికారి పరిమళజ్యోతి, తహసీల్దారు ఆలీఖాన్, ఈఓఆర్‌డీ సురేశ్‌బాబు, ఎంఈఓ గంగిరెడ్డి, గ్రంథాలయ సంస్థ మాజీ జిల్లా చైర్మన్ జి.రామకోటిరెడ్డి, తెలుగు యువత మండల నాయకులు రామచంద్రారెడ్డి, నరసారెడ్డిపల్లె చంద్ర, గుణ, మండల కన్వీనరు విజయభాస్కర్‌రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జ్ బుజ్జన్న, టీడీపీ సీనియర్ నేతలు వీరభద్రారెడ్డి, ఇందిరెడ్డిశివారెడ్డి, మల్లిఖార్జునరెడ్డి, షబ్బీర్‌హుసేన్, మన్నూరు అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర 2047 విజయవంతం చేద్దాం: ఎమ్మెల్యే

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 21 : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గ్రామసభలను విజయవంతం చేసి చంద్రబాబు స్వర్ణాంధ్ర 2047ను విజయవంతం చేద్దామని కడప ఎమ్మెల్యే మాధవి పిలుపునిచ్చారు. శనివారం పాతకడప టూరిజం భవనంలో మన మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. కమిషనరు వైఓ నందన్, అడిషనల్ కమిషరు రాకేశ్‌చంద్రం, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

20వ డివిజన్‌లో.. కడప నగరం 20వ డివిజన్ మారుతీనగర్‌లో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్య క్రమంలో ఎమ్మెల్యే మాధవి పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దృష్టికి పలు సమస్యలు

దేవునికడప సచివాలయంలో మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి సమావేశంలో స్థానిక ప్రజలు వారి సమస్యలను ఎమ్మెల్యే మాధవి దృష్టికి తీసుకురాగా వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే ధ్యేయం: బీటెక్ రవి

లింగాల, సెప్టెంబరు 21: ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలన సాగిస్తున్నారన్నారని పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి) అన్నారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు. మండలంలోని లోపట్నూతల గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం గ్రామసభ నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఇది మన ప్రభుత్వం కరపత్రాలను పంపిణీ చేసి ప్రజలతో మాట్లాడారు. వంద రోజుల్లోనే ప్రభుత్వం సాధించిన అంశాలను ప్రజలకు వివరించడంతో పాటు వారి సమస్యలను తెలుసుకుంటు న్నామన్నారు. పోలవరానికి రూ.12500 కోట్లు కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రాంట్ తెప్పించడం టీడీపీ ప్రభుత్వ ఘనత అన్నారు. గత ప్రభుత్వ హయాంలో సర్పంచుగా చెక్‌పవర్ ఉండేదా అని ప్రశ్నించారు. ఒక్క రూపాయి అయిన డ్రా చేసిందా అని ప్రజలకు చెప్పాలన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.1459కోట్లు పంచాయతీ రాజ్ ద్వారా సర్పంచుల అకౌంట్‌లకు వేసి గ్రామాలను మెరుగుపరచాలని చెప్పా రన్నారు. అనంతరం ఆయనకు ప్రజలు అర్జీలు సమర్పించి సమస్యలను చెప్పుకొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ లోకేశ్వర్‌రావు, డీటీ త్రిభువన్‌రెడ్డి, ఎస్ఐ మధుసూధన్‌రావు పాల్గొన్నారు.

ఇది సంక్షేమ ప్రభుత్వం


కార్యక్రమంలో మాట్లాడుతున్న బీటెక్ రవి


గురిజాలలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రఘునాథరెడ్డి

వేముల, సెప్టెంబరు 21: కూటమి ప్రభుత్వం సంక్షేమ ప్రభుత్వమని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారథిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని దుగ్గన్నగారిపల్లె, పెద్దజూటూరు, చింతలజూటూరు గ్రామాలలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేశారు. మాజీ ఎంపీపీ రాజగోపాల్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీకాంత్‌రెడ్డి, గంగాదర్‌రెడ్డి, వసంతరెడ్డి పాల్గొన్నారు.

అధికారులు విఫలం

దుగ్గన్నగారిపల్లెలో ఏర్పాటుచేసిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి సంబంధించి ఏర్పాట్లు చేయడంలో అధికారులు విఫలమయ్యారు. 11గంటలు అయినా పంచాయతీ కార్యాలయం తెరవలేదు. దీంతో కార్యక్రమానికి వచ్చిన ప్రజలు, నాయకులు కార్యాలయం బయట వేచి ఉన్నారు.

సింహాద్రిపురం: మండలంలోని గురిజాల గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ నేతలు, అధికారులు గడప గడపకు వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. పులివెందుల టీడీపీ సీనియర్ నేత, వేంపల్లి మండల టీడీపీ పరిశీలకులు అజ్జుగట్టు రఘునాథరెడ్డి చేతుల మీదుగా పోస్టర్‌ను ఆవిష్కరించారు.

అన్నక్యాంటీన్ కోసం స్థల పరిశీలన

పోరుమామిళ్ల, సెప్టెంబరు 21 : పోరుమామిళ్ల పంచాయతీలో అన్నక్యాంటీన్ ఏర్పాటు చేయడానికి ఎంపీడీవో వర ప్రసాదరావు, మేజరు పంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్ స్థలం పరిశీలించారు. పంచాయతీలో కాపుబడి స్థలం అనుకూలమైన ప్రదేశంగా గుర్తించారు. అన్నక్యాంటీన్ ఏర్పాటుకు కలెక్టరుకు నివేదిక సమర్పిస్తామన్నారు. కలెక్టరు ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటసుబ్బయ్య, వీఆర్వో చెన్నకేశవులు, టీడీపీ నాయకులు ఇమాంహుస్సేన్, ఎం.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కొత్త కార్మిక చట్టాలతో డ్రైవర్లకు కష్టాలు

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 21: కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నూతన కార్మిక చట్టాలతో వాహన డ్రైవర్లకు కష్టాలు ప్రారంభం అయ్యాయని, ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు హరి పేర్కొన్నారు. శనివారం ఏఐటీయూసీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మిక చట్టాలను కాలరాస్తూ తీసుకొచ్చిన జీవోనెం.106/12తో డ్రైవర్లకు ఉపాధి కరువైందని విమర్శించారు. ఈనెల 23, 24, 25 తేదీల్లో మోటారు వర్కర్స్ 18వ జాతీయ మహాసభలు బెంగళూరులో జరుగుతాయని వాహన డ్రైవర్లు, కార్మికులు ఈ మహాసభలలో పాల్గొనాలని కోరారు. ఆటో వర్కర్స్ యూనియన్ పట్టణ సహాయ కార్యదర్శి మత్తా శ్రీను, ఉపాధ్యక్షుడు ఎల్లయ్య, నాయబ్‌రసూల్ పాల్గొన్నారు.

'సీడీపీఓపై చర్యలు తీసుకోవాలి'

ప్రొద్దుటూరు క్రైం, సెప్టెంబరు 21 : ప్రొద్దుటూరు బుబ్బిరెడ్డికొట్టాలు 1లోఅంగన్‌వాడీ సెంటర్‌లో ఖాళీ అయిన పోస్టుకు బీసీ-సీ కేటగిరికి అనర్హుల నుంచి అర్జీలను సీడీపీవో తీసుకున్నారని ఆమెపై తగిన చర్యలు తీసుకోవాలని సీపీఐ ఏరియా కార్యదర్శి పి.సుబ్బరాయుడు డిమాండు చేశారు. శనివారం పెన్నానగర్‌లోని సీపీఐ కార్యాలయంలో విలేఖరులతో ఆయన మాట్లాడారు. సమావేశంలో నేతలు శ్రీహరి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మోక్షం ఎప్పుడు..?

గండికోట ముంపునకు గురైన ప్రభుత్వ కార్యాలయాలు





గండికోట బ్యాక్‌వాటర్‌లో మునిగి ఉన్న కొండాపురం తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలు, పాడుబడిన పీహెచ్‌సీలో ఉన్న కొండాపురం పశువుల ఆసుపత్రి

కొండాపురం, సెప్టెంబరు 21: గండికోట ప్రాజెక్టు నిర్వాసితులకు వసతుల కల్పనలో గత వైసీపీ ప్రభుత్వం విఫలమైందని చెప్పవచ్చు. సచివాలయాలు తప్ప నిత్యం ప్రజలకు అవసరమయ్యే ప్రభుత్వ కార్యాలయలను పునర్నించికపోవడంతో నిర్వాసితులు ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా మండల కేంద్రంలో ముంపునకు గురైన ప్రభుత్వ కార్యాలయాలను గత ఐదేళ్లలో ఒక్కటి కూడా నిర్మించలేదు.ఐదేళ్లలో ప్రభుత్వ కార్యాలయల నిర్మాణం కోసం గత ప్రభుత్వం 10 సార్లు పైగా టెండర్లు పిలిచిన ఒక్క కాంట్రాక్టరు కూడా ముందుకు రాకపోవడం గమనార్హం. గతంలో నిర్మించిన ముంపునకు గురి కాని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో ముంపునకు గురైన వాటిని సర్దుబాటు చేసి నెట్టుకొస్తున్నారు. తహసీల్దార్ కార్యాలయాన్ని పాత స్టేట్‌బ్యాంక్ భవనంలో, ఎంపీడీవో కార్యాలయాన్ని అంగన్‌వాడీ కేంద్రంలో, పశువుల ఆసు పత్రిని పాత పీహెచ్‌సీలో, కొండాపురం పోలీస్‌స్టేషన్‌ను ముచ్చుమర్రి ప్రభుత్వ పాఠశాలలోను ఏర్పాటుచేసి తాత్కాలికంగా సేవలు నిర్వహిస్తున్నారు. తాళ్లప్రొద్దుటూరు పోలీస్‌స్టేషన్‌కు తాత్కాలికంగా రేకుల షెడ్డు ఏర్పాటు చేసి అందులో నుంచే పాలన సాగిస్తున్నారు.

కూటమి ప్రభుత్వంలో మోక్షం కలిగేనా..?

గత వైసీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ కార్యాలయాలకు టెండర్లు పిలిచినప్పటికీ బిల్లులు రావన్న భయంతో టెండర్లు వేయడానికి ఎవరూ ముందుకు రాలేదు.దీంతో కార్యాలయాల నిర్మాణం గత ప్రభుత్వంలో కాగితాలకే పరిమితమయింది.ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కొలువు దీరడంతో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం వెంటనే చేపట్టాలని నిర్వాసితులు కోరుతున్నారు.ఈ విషయమై జమ్మలమడుగు ఆర్డీవో శ్రీనివాస్‌ను వివరణ కోరగా టెండర్ల ప్రక్రియ తమ చేతుల్లో లేదని తెలిపారు. కాగా గత ప్రభుత్వంలో పిలిచిన అన్ని టెండర్లను కూటమి ప్రభుత్వం రద్దు చేసినట్లు తెలుస్తోంది. కొత్తగా టెండర్లు పిలిచి వెంటనే ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం చేపట్టాలని నిర్వాసితులు కోరుతున్నారు.

ఉపాధి పనులు పారదర్శకంగా జరగాలి

అడిషనల్ పీడీ నాగరత్నమ్మ

అట్లూరు, సెప్టెంబరు 21 : ఉపాధి హామీ పనులు పారదర్శకంగా జరగాలని డ్వామా అడిషనల్ పీడీ నాగరత్నమ్మ తెలిపారు. శనివారం 19వ సామాజిక తనిఖీ అట్లూరు ఎంపీడీవో కార్యాలయంలో జరిగింది. మాడపూరు, ముత్తుకూరు ఫీల్డ్‌అసిస్టెంట్లు అవినీతికి పాల్పడినట్లు ఆయా గ్రామాల స్థానికులు అధికారులు ఎదుట ఫిర్యాదు చేశారు. దీంతో ఏపీడీ ఆనంద్‌తో విచారణ చేయిస్తామని డ్వామా పీడీ తెలిపారు. ఈ కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ అధికారి విజయ భాస్కర్, జిల్లా విజిలెన్స్ అధికారి రామలింగా రెడ్డి, ఎస్ఆర్పీ భాస్కర్, ఎంపీడీవో సుజాతమ్మ, మండల టీడీపీ నాయకులు పి.మల్లికార్జునరెడ్డి, ఈసీ సుధాకర్, ఏపీ రవిచంద్ర ఎఫ్ఏలు తదితరులు పాల్గొన్నారు.

కంపచెట్లు తొలగింపు



ఖాజీపేట, సెప్టెంబరు 21: కేసీ కెనాల్ కొండపేట కాలువ కింద ప్రతి ఎకరాకు నీరు అందించాలని అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అందులో భాగంగా కొండపేట కాలువలోని 3వ నంబరు తూముల నుంచి దుంపలగట్టు చెరువు వద్దకు కాలువకు ఇరువైపులా కంపచెట్లు అల్లుకుపోయి నీరు పోవడంలేదని ఎక్స్‌కవేటర్ సాయంతో తొలగిస్తున్నారు. దీంతో చెరువు నీరు నింపడంతోపాటు ఆయకట్టుకు కూడా నీరు అందిస్తామని కేసీ కెనాల్ ఏఈ సుబ్బరాయుడు అన్నారు. అక్రమంగా కాలువలకు బిగించిన మోటార్లను రైతులు స్వచ్ఛందంగా తీయాలన్నారు.

'మనోభావాలు దెబ్బతినే విధంగా ఉంది'

జమ్మలమడుగు, సెప్టెంబరు 21: తిరుమల తిరుపతి వేంకటేశ్వరస్వామి పవిత్ర ప్రసాదమైన లడ్డూలో కల్తీ జరిగిందని చెప్పడం ప్రజల మనోభావాలు దెబ్బతినే విధంగా ఉందని ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు. శనివారం జమ్మలమడుగులో ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ మాట్లాడారు. ఆధ్యాత్మికతను దెబ్బతీసేలా రాజకీయ నేతలు వ్యాఖ్యలు చేయరాదన్నారు. తిరుమల లడ్డూలో కల్తీ పేరుతో ప్రకటనలు దారుణంగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పొన్నపురెడ్డి గిరిధర్‌రెడ్డి, చిట్టెపు విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి కల్పించడమే మెప్మా లక్ష్యం కావాలి

- ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు ,సెప్టెంబరు 21 : ఉపాధి అవకాశాలు కల్పించడమే మెప్మా లక్ష్యం కావాలని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక శివాలయం సర్కిల్‌లో డ్వాక్రా మహిళల ఉత్పత్తులకు మెప్మా అర్బన్ మార్కెట్ ను ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డ్వాక్రా రుణాల ద్వారా స్వయం ఉపాధి పెంపొందాలన్నారు. ఈసందర్భంగా డ్వాక్రా మహిళల ఉత్పత్తులను వంటకాలు, పిండి వంటలను పరిశీలించారు. ఈ మార్కెట్‌లో 40 రకాల స్టాల్స్ ఏర్పాటు చేసినట్లు మెప్మా సీఎంఎం కెజియా తెలిపారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మెన్ ఆసం రఘురామిరెడ్డి, కౌన్సిలర్ వంగనూరు మురళీధర్‌రెడ్డి, కమాల్ బాషా,టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఈవీ సుధాకర్ రెడ్డి, కమిషనర్ రఘునాథరెడ్డి, మెప్మా సీవోలు రమణారెడ్డి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యువత మత్తుకు బానిస కావద్దు



మాట్లాడుతున్న అర్బన్ సీఐ రాజగోపాల్

బద్వేలు రూరల్, సెప్టెంబరు 21 : యువత మత్తుకు బానిస కాకుండా సేవాగుణానికి అలవాటు పడాలని అర్బన్ రూరల్ సీఐలు రాజగోపాల్, నాగభూషణం తెలిపారు. మాదకద్రవ్యాల నివారణ పక్షోత్సవాల్లో భాగంగా జిల్లా స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో ఎస్ఆర్ హెచ్ఆర్‌సీ ఆధ్వర్యంలో రాచపూడి నాగభూషణం డిగ్రీకళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ సాయి క్రిష్ణ, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ సుబ్బారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ సత్యం, స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతి నిధులు, ఎస్ఆర్‌హెచ్ఆర్‌పీ ట్రస్టు సభ్యులు వంశీక్రిష్ణ, గంటా రామ్మోహన్‌రెడ్డి, విజయ్ చిన్న, గూటూరు విజయకుమార్, మాల కొండయ్య భరతలక్ష్మి, కవిత పాల్గొన్నారు.

సంక్షేమ పాలన ప్రభుత్వ లక్ష్యం



ప్రొద్దుటూరులో మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, ముద్దనూరులో స్టిక్కర్ చూపిస్తున్న భూపేశ్‌రెడ్డి, బద్వేలులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న రితీష్‌రెడ్డి

ప్రొద్దుటూరు,సెప్టెంబరు 21 : సోములవారి పల్లె పంచాయతీని సంపూర్ణంగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. శనివారం సోములవారిపల్లె పంచాయతీలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం వందరోజుల్లో ప్రజా సంక్షేమ పాలనలో సాధించిన ప్రగతిని ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ మున్సిపల్ చైర్మెన్లు వీఎస్ ముక్తియార్, ఆసం రఘురామిరెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఈవీ సుధాకర్ రెడ్డి, మండల అధ్యక్షుడు బోడెల బాబుల్ రెడ్డి, బీజేపీ జిల్లాప్రధాన కార్యదర్శి కోనేటి ప్రదీప్‌రెడ్డి, మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, బాబు, పల్లేటి రాముడు తదితరులుపాల్గొన్నారు.

ముద్దనూరు..: చంద్రబాబు పాలన అంటే ఎలా ఉంటుందో మొదటి వంద రోజుల్లో చూపించారని జమ్మలమడుగు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధి యామవరం గ్రామంలో శనివారం గ్రామ టీడీపీ నాయకులు మాజీ ఎంపీటీసీ ఒంటికొమ్ము మురళీధర్‌రెడ్డి,ఉపసర్పంచ్ లక్ష్మీరెడ్డి ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకులు జంబాపురం రమణారెడ్డి, ఎంపీడీవో చంద్రమౌళీశ్వర్, తహసీల్దారు రామకుమారి, ఈవోపీఆర్డీ వీరభద్రుడు, నాయకులు చింతాశివరామిరెడ్డి, కుడుముల శశిధర్‌రెడ్డి,భాస్కర్‌రెడ్డి, తుమ్మలూరు రంగారెడ్డి,కేశవరెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ,పవన్‌కుమార్, రఘునాథరెడ్డి,ఖాదర్‌ఖాన్, పురుషోత్తం, సన్నీ, బసయ్య,టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజుపాలెం..: ఇది మంచి ప్రభుత్వం కారర్రమాన్ని శనివారం టంగుటూరు సచివాలయంలో టీడీపీ నాయకులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కర్ణమ్మ, ఎంపీటీసీ గుత్తి దస్తగిరి, టీడీపీ నాయ కులు ఖాదర్‌బాషా, జగన్‌మోహన్‌రెడ్డి, గుత్తిదస్తగిరి, సంజీవరెడ్డి, వెంకటరెడ్డి, పంచాయతీ సెక్రటరీ బాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: మన ప్రభుత్వం మంచి ప్రభుత్వం అనే కార్యక్రమంలో భాగంగా టేకూరుపేటలో పంచాయతీ విస్తరణాధికారి రాజీవ్‌రెడ్డి వంద రోజుల పాలనపై ప్రజలకు అవగాహన కల్పించారు. శనివారం పురవీధుల్లో ప్రభుత్వ పనితీరుపై నిర్వహించిన కరపత్రాలను పంపిణీ చేశారు.

బద్వేలుటౌన్..: సంక్షేమ పాలన ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త రితీష్ కుమార్‌రెడ్డి, బీజేపీ నేత బొజ్జ రోశన్న అన్నారు. శనివారం పట్టణంలోని మహబూబ్‌నగర్,శివానగర్, ఆంజనేయనగర్, తదితర వార్డుల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు వెంగల్‌రెడ్డి, మిత్తికాయల రమణ, శివయ్యస్వామి, రాజమాత రమేష్, బిగ్‌బాస్, సింగంశెట్టి వెంకటసుబ్బయ్య, నానబాల వెంకటేశ్వర్లు, దద్దం వెంకటేశ్వర్లు, చికెన్ సెంటర్ ఖాజా, పెరుగువెంకటయ్య, జగదీశ్వర్‌రెడ్డి, మురళీ, వెంకటయ్యయాదవ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

గోపవరం..: ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం గోపవరం మండలం శ్రీనివాస పురంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బద్వేలు నియోజకవర్గ సమన్వయ కర్త రితీష్‌రెడ్డి ఎంపీపీ ధనలక్ష్మి, ఎంపీడీవో రామక్రిష్ణయ్య,ఈవోపీఆర్‌డీ షేక్ హసీనా ,జడ్పీటీసీ జయరామిరెడ్డి, మండల టీడీపీ ప్రధాన నాయకులు పల్లెం యల్లారెడ్డి, సుధాకరరెడ్డి, శంకర్‌రెడ్డి, భూమిరెడ్డిపల్లె రమణారెడ్డి, కొండయ్య, కార్యదర్శులు విజయకుమార్, శ్రీనివాసులరెడ్డి, మోషయ్య, కొండయ్య, ఆయా శాఖలఅధికారులు పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠం..: రాష్ట్రంలోని బడుగు బలహీన వర్గాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ మండల అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి అన్నారు. శనివారం బ్రహ్మంగారి మఠం మండలంలోని నాగిశెట్టిపల్లె, పలుగురాళ్లపల్లె పంచాయతీల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంగమునిరెడ్డి, ఏవో మల్లికార్జునరావు, అధికారులు డిప్యూటీ తహసీల్దారు జాన్సన్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, టీడీపీ నేతలు బీమానాయుడు, సాంబశివారెడ్డి, లక్ష్మీనాయుడు, చంద్రబాబు, సాంబశివ, వెంకటరమణ నాయుడు, శివ, రామాంజి, శివయాదవ్, మేకల సుధాకర్, చిలమల నాగయ్య, ప్రభు దాస్ పాల్గొన్నారు. అనంతరం నాగిశెట్టిపల్లె ఎంచాయతీలో గ్రామ సచివాలయానికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్,ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ చిత్రపటాలను టీడీపీ నేతలు అధికారులకు అందించారు.

చాపాడు..: చంద్రబాబు పేదలకోసం పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టినట్లు పలువురు అధికారులు, టీడీపీ నాయకులు ప్రజలకు వివరించారు. శనివారం ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమాన్ని అయ్యవారిపల్లె, అల్లాడుపల్లె, భద్రిపల్లె, కుచ్చుపాప గ్రామాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం వెంకటరమణ, వెటర్నరీ డాక్టర్ మహ్మద్‌గౌస్, సూపర్‌వైజర్లు సుబ్బరత్నమ్మ, రాజ్యలక్ష్మి, సర్పంచ్ గుత్తి మల్లీశ్వరి, టీడీపీ నాయకులు వీరనారాయణ, మేకల బాబు, గోసుల కృష్ణారెడ్డి, పెరుగు నారాయణ, గుండు వీరయ్య, పిచ్చపాటి మునిశేఖర్‌రెడ్డి, ఈశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సాగిన ఎస్‌జీఎఫ్ పోటీలు



ఖాజీపేటలో కబడ్డీ ఆడుతున్న విద్యార్థినులు

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 21: ఎస్‌జీఎఫ్ మండల స్థాయి అండర్-14, 17 బాలబాలికల క్రీడా పోటీలు ఉత్సాహంగా సాగాయి. శనివారం కల్లూరు జడ్పీ హైస్కూలులో వాలీబాల్, చెస్, యోగా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను పాఠశాల హెచ్ఎం సురేష్, ఎస్ఎంసీ చైర్మన్ బాలరాజు పోటీలను ప్రారంభించారు. మండలంలోని వివిధ పాఠశాలల నుంచి 500 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. క్రీడాకారులకు మధ్యాహ్నం కల్లూరు జడ్పీ పాఠశాల పూర్వ విద్యార్థులు, కల్లూరు, రేగళ్లపల్లె ప్రజలు భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మండలస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల నిర్వాహకులు షేక్‌బాబు, ఓబయ్య, పీడీ అల్లాబకాష్, రాయలసీమ వ్యాయామ విద్య కళాశాల విద్యార్థులు పోటీలను పర్యవేక్షించారు.

ఖాజీపేట..: మండల పరిధిలో రెండు రోజులపాటు విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. శనివారం బాలికలకు ఆటల పోటీలు నిర్వహించి పోటీల్లో గెలుపొందిన కబడ్డీకి 9 మంది, వాలీబాల్‌కు 19 మంది, ఖోఖో 24 మంది విద్యార్థులను నియోజకవర్గస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో నాగస్వర్ణలత , వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ముద్దనూరు..: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కల్గిస్తాయని సీఐ దస్తగిరి పేర్కొన్నారు.స్థానిక బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండలస్థాయి క్రీడలను శనివారం సీఐ దస్తగిరి ప్రారంభించారు. మొదటి రోజు 200 మంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో సుబ్బారావు, వ్యాయామ ఉపాధ్యాయులు మాధవరెడ్డి, ఇజ్రాయిల్,దేవిక పాల్గొన్నారు.

ఆశాజనకంగా పసుపు సాగు



ఖాజీపేట, సెప్టెంబరు 21: మైదుకూరు నియోజకవర్గం రైతులు పసుపును సాగు చేయడంలో ఎక్కువగా మొగ్గుచూపుతారు. గతంలో ఎక్కువగా సాగు చేసిన రైతులు వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత గిట్టుబాటు ధర లేకపోవడంతో ప్రత్యామ్నాయ పంటలపై మొగ్గు చూపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గిట్టుబాటు ధర వస్తుందని నియోజకవర్గంలో దాదాపు రెండు వేల ఎకరాలకు పైగా పసుపు పంట సాగు చేశారు. పసుపు విత్తనం పుట్టి (300 కేజీలు) రూ.14 వేలు జరిగిందని, ఎకరాకు ఆరు పుట్లు వేయడంతో ఇప్పటి వరకు ఎకరాకు దాదాపు రూ.లక్ష వరకు ఖర్చు చేశామని రైతులు అంటున్నారు. ఈ ప్రభుత్వంలోనైనా మద్దతు ధర వస్తుందని ఆశలు పెట్టుకున్నట్లు రైతన్నలు తెలిపారు.కాగా ఖాజీపేట మండలంలో హార్టికల్చరల్ పంటలు పసుపు, అరటి, బొప్పాయి, నిమ్మ, చీనీ పంటలు అధికంగా సాగు చేశారు. అయితే పంటలు పరిశీలించి తగిన సూచనలు ఇచ్చే అధికారులు ఎవ్వరూ లేరని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.